
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3



విశాఖపట్నం

జిల్లా వార్తలు

శనివారం 22 జూన్ 2024

పలువురు ఇన్‌స్పెక్టర్లకు పోస్టింగ్‌లు

మహారాణిపేట, జూన్ 21: నగర పోలీస్ కమిషరేట్ పరిధిలో పలువురు ఇన్‌స్పెక్టర్లకు పోస్టింగ్‌లు ఇచ్చారు. సిటీ వీఆర్‌లో ఉన్న ఎస్.విద్యాసాగర్‌ను మల్కాపురం లా అండ్ ఆర్డర్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా, అదేవిధంగా సీహెచ్ ప్రసాద్‌ను కంచరపాలెం లా అండ్ ఆర్డర్ ఇన్‌స్పెక్టర్‌గా, ఎన్.సన్యాసినాయుడును సిటీ ట్రైనింగ్ సెంటర్ అధికారిగా నియమించారు. ఈ మేరకు కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్ ఆదేశాలు ఇచ్చారు. అలాగే గతంలో సీసీఆర్‌బి ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన మహ్మద్ సనుల్లా ప్రస్తుతం మల్కాపురం ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పుడు తిరిగి సీసీఆర్‌బి ఇన్‌స్పెక్టర్‌గా విధుల్లో చేరనున్నారు.



ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం

అసెంబ్లీలో శుక్రవారం శాసనసభ్యులుగా ప్రమాణ స్వీకారం చేస్తున్న గంటా శ్రీనివాసరావు (భీమిలి), వెలగపూడి రామకృష్ణబాబు (విశాఖ తూర్పు నియోజకవర్గం), సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ (విశాఖ దక్షిణ), పి.విష్ణుకుమార్‌రాజు (విశాఖ ఉత్తరం), పి.గణబాబు (విశాఖ పశ్చిమ), పల్లా శ్రీనివాసరావు (గాజువాక), పంచకర్ల రమేష్‌బాబు (పెందుర్తి)

వైసీపీ నేతల హైరానా

- పార్టీ కార్యాలయం కోసం నిర్మించిన భవనానికి అనుమతుల కోసం ఇప్పుడు దరఖాస్తు
- అదీ వీఎంఆర్‌డీఏకు...
- కొర్రీ వేసి తిప్పి పంపిన అధికారులు

విశాఖపట్నం, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యాలయం కోసం ఎండాడలో అనుమతి లేకుండా నిర్మించిన భవనాన్ని కూల్చివేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో వైసీపీ నాయకులు ఇప్పుడు అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారు. ఇక్కడ కూడా గిమ్మిక్కులు ప్రదర్శించారు. వాస్తవానికి భవన నిర్మాణానికి జీవీఎంసీకి దరఖాస్తు చేయాలి. కానీ అక్కడ దరఖాస్తు ఇవ్వకుండా వీఎంఆర్‌డీఏకు పెట్టారు. మీసాల వెంకట సుబ్రసాయిశరణ్ పేరుతో దరఖాస్తు చేశారు. ఈ విషయం గమనించిన వీఎంఆర్‌డీఏ చీఫ్ అర్బన్ ప్లానర్ సంజయ్ కుమార్, అందులో పేర్కొన్న మొబైల్ నంబరు 9885747065కి కాల్ చేశారు. జీవీఎంసీకి కాకుండా వీఎంఆర్‌డీఏకి ఎందుకు పెట్టారో తెలుసుకోవాలని యత్నించారు. కానీ ఆ వ్యక్తి కాల్ ఆన్సర్ చేయకపోవడంతో, దరఖాస్తుపై కొర్రీలు వేసి వెనక్కి పంపించేసినట్టు సీయూపీ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఉల్లంఘనల పేరిట గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రస్తుత టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు చెందిన భవనాన్ని జీవీఎంసీ అధికారులు కూల్చివేశారు. అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలు కాబట్టి వాటిని కూల్చివేయాలని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మను కలిసి శుక్రవారం వినతిపత్రం సమర్పించారు.



నగరంలో వర్షం

విశాఖపట్నం, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): నగరంలో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ తీవ్రమైన ఉక్కపోత కొనసాగింది. ఇళ్లలో ఉన్నా భరించలేని పరిస్థితి నెలకొంది. అయితే సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారింది. తొలుత నగర శివారుల్లో భారీగా మేఘాలు ఆవరించి వర్షం కురిసింది. ఆ తరువాత రాత్రి నగరంలోని పలు ప్రాంతాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. వర్షం కురిసినా వాతావరణం చల్లబడలేదు సరికదా ఉక్కపోత మరింత పెరిగింది. వాతావరణ అనిశ్చితితో ఈ వర్షం పడిందని, రుతుపవనాల ప్రభావం వల్ల కాదని వాతావరణ నిపుణులు పేర్కొన్నారు. బంగాళాఖాతంలో అల్పపీడనాలు ఏర్పడి గట్టి వర్షాలు పడితేగానీ వాతావరణం చల్లబడే అవకాశం లేదంటున్నారు.

కేజీహెచ్‌లో తాగునీటికి కటకట!

పనిచేయని ఆర్‌ఓ కేంద్రాలు

- మరమ్మతులకు గురైనా పట్టించుకోని అధికారులు
- వార్డుల్లోనూ అదే పరిస్థితి
- స్వయంగా నాటి మంత్రి గుర్తించి సూపరింటెండెంట్ దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం శూన్యం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

కేజీహెచ్‌లో రోగులు, వారికి సాయంగా వచ్చేవారు తాగడానికి గుక్కెడు నీరు కూడా దొరకడం లేదు. ఇక బాత్‌రూమ్‌లకు నీటి సరఫరా గురించి చెప్పనక్కర్లేదు. అధికారులు నాలుగు భవనాలు కట్టేసి, రంగులేసేసి అంతా బాగుందనుకుంటున్నారు. అసలు రోగులకు ప్రాథమిక అవసరాలైన నీరు, ఆహారం గురించి పట్టించుకోవడం లేదు.



భావనగర్ వార్డు ఎదుట అలంకారప్రాయంగా కొళాయిలు



గైనిక్ వార్డు వద్ద పనిచేయని వాటర్ ప్లాంట్

పనిచేయని ఆర్‌ఓ తాగునీటి కేంద్రాలు

కేజీహెచ్‌కు వచ్చే రోగులు, వారి సహాయకులకు తాగునీరు అందించేందుకు పలువురు దాతలు ఎక్కడికక్కడ ఆర్‌ఓ నీటి కేంద్రాలు ఏర్పాటుచేశారు. గైనకాలజీ, పీడియాట్రిక్, రాజేంద్రనగర్, కార్డియాలజీ ఎదురుగా, అవుట్ పేషెంట్ విభాగం వద్ద ఇవి ఉన్నాయి. వీటిలో ఒక్కటి కూడా పనిచేయడం లేదు. ఎంతో వ్యయంతో ఏర్పాటుచేసిన కేంద్రాలు పాడైపోతే చూస్తున్నారు తప్పితే వాటికి మరమ్మతులు చేయించడం లేదు.

వార్డుల్లో పనిచేయని యంత్రాలు

బయట కాకుండా ఏ వార్డుకు ఆ వార్డులో ప్యూరిఫైర్ వాటర్ కోసం ప్రత్యేక యంత్రాలు రెండున్నరేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. వాటిని పెట్టిన మూడు నెలలకే నాటి ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని కేజీహెచ్ తనిఖీకి వెళ్లారు. రాజేంద్రప్రసాద్ వార్డులో వాటర్ ప్యూరిఫైర్ పనిచేయడం లేదని గుర్తించి, నాటి సూపరింటెండెంట్ దృష్టికి తీసుకువెళ్లారు. చాలా వార్డులో ఇవి కూడా పనిచేయడం లేదు. ఫిల్టర్లు మార్చే దిక్కు లేక మూలకు చేరుతున్నాయి.

కరివేపాకు కూడా కనిపించని కిచిడీ!

రోగులకు జావ వంటి ఉప్మా పెడుతున్నారని 'ఆంధ్రజ్యోతి' రెండు రోజుల క్రితం కథనం ప్రచురించగా అధికారులు అప్రమత్తమయ్యారు. డైట్ కాంట్రాక్టర్‌ను మందలించారు. దాంతో శుక్రవారం నుంచి ఉప్మా ఆపేశారు. ఆ స్థానంలో కిచిడీ పేరుతో కలర్ రైస్ అందిస్తున్నారు. అన్ని రకాల కూరగాయలు కలిపి వండితే దానిని 'కిచిడీ' అంటారు. కానీ రోగులకు పంపిణీ చేసిన కిచిడీలో కనీసం కరివేపాకు గానీ, పచ్చిమిరప కాయ ముక్క గానీ లేవు. కారం, పసుపు, ఉప్పు కలిపిన అన్నం వండి పెడుతున్నారు.



శుక్రవారం రోగులకు అల్పాహారంగా అందించిన ఏమాత్రం నాణ్యత లేని కిచిడీ

ఇడ్లీ యంత్రం కొనుగోలుకు కొటేషన్

గతంలో ఇడ్లీ తయారీకి యంత్రం ఉండేది. అది పాడైపోయి ఏడాది దాటింది. ఆరు నెలల క్రితం కొత్తది

... మిగతా 4వ పేజీలో

అనకాపల్లిలోనూ అదేవరస!

వైసీపీ దందా

- జీవీఎంసీ అనుమతులు లేకుండానే పార్టీ కార్యాలయం కోసం భారీ భవనం నిర్మాణం
- హైవే సమీపంలో 1.75 ఎకరాలు 33 ఏళ్లు లీజుకు...
- రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూమి... ఏడాదికి ఎకరానికి కేవలం రూ.1000 చెల్లించేలా ఉత్తర్వులు
- స్థానికులు అభ్యంతరం వ్యక్తంచేసినా పట్టించుకోని వైనం
- హైకోర్టును ఆశ్రయించిన కొత్తూరు నర్సింగరావుపేట గ్రామస్థులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

అధికారాన్ని అడ్డం పెట్టుకొని వైసీపీ సాగించిన అడ్డగోలు వ్యవహారాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. విశాఖపట్నంలో మాదిరిగానే అనకాపల్లిలోనూ రూ.కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని లీజు పేరుతో కారుచౌకగా దక్కించుకుని పార్టీ కార్యాలయం కోసం ప్యాలెస్ నిర్మించారు. జీవీఎంసీ నుంచి ప్లాన్ అప్రూవ్ కాకుండానే కేవలం దరఖాస్తు చేసి భవన నిర్మాణ పనులు చకచకా కానిచ్చేశారు.

అనకాపల్లి మండలం కొత్తూరు నర్సింగరావుపేటలో పార్టీ కార్యాలయం కోసం జీవీఎంసీ అనుమతి లేకుండా నిర్మించిన ప్యాలెస్



అనకాపల్లి మండలం రాజుపాలెం రెవెన్యూ కొత్తూరు నర్సింగరావుపేట గ్రామ పరిధిలోని సర్వే నంబరు 75/1లో సుమారు మూడు ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఆ స్థలం జిల్లా పార్టీ కార్యాలయానికి కేటాయించేలా వైసీపీ నాయకులు 2022లో పావులు కదిపారు. నాటి ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో రెవెన్యూ అధికారులు 75/1లోని ఒక ఎకరా 75 సెంట్ల స్థలాన్ని సబ్‌డివిజన్ చేసి మరీ పార్టీ కార్యాలయానికి కేటాయించేశారు. జాతీయ రహదారికి సమీపంలో ఉండడంతో ఈ ప్రాంతంలో ఎకరా రూ.8 కోట్లు నుంచి రూ.10 కోట్లు వరకూ పలుకుతోంది. కానీ వైసీపీ పెద్దలు ఏడాదికి కేవలం ఎకరాకు రూ.వెయ్యి చొప్పున చెల్లించేలా 33 ఏళ్లకు లీజుకు తీసుకున్నారు. అంటే ఏడాదికి కేవలం రూ.1,750 మాత్రమే ప్రభుత్వానికి చెల్లించే విధంగా ఉత్తర్వులు జారీచేశారు. వాస్తవానికి 340 జీవో ప్రకారం రాజకీయ పార్టీలు, సంస్థలకు స్థలాలు కేటాయించాల్సి వస్తే...ప్రజాధనంతో అభివృద్ధి చేయని ప్రభుత్వ, బంజరు భూములను మాత్రమే ఇవ్వాలి. కానీ వైసీపీ ప్రభుత్వ పెద్దలు నిబంధనలు పక్కనపెట్టి సర్వే నంబరు 75/1లో వీఎంఆర్‌డీఏ గతంలో అభివృద్ధి చేసిన ఎకరా 75 సెంట్ల స్థలాన్ని 2022 డిసెంబరు 20న జీఓ నంబరు 759 ఆధారంగా కేటాయించుకున్నారు.

జీవీఎంసీ ప్లాన్ అప్రూవ్ కాకుండానే..

నాటి జిల్లా వైసీపీ అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ పేరుతో జీవీఎంసీ ప్లానింగ్ విభాగానికి భవన నిర్మాణం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారు. కానీ జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగానికి ఫీజులేవీ చెల్లించకపోవడంతో ఇంతవరకూ అధికారికంగా ప్లాన్ అప్రూవ్ కాలేదు. వాస్తవానికి ప్రభుత్వం ఇచ్చిన లీజు భూమిలో నిర్మాణ పనులు చేపట్టాల్సి వస్తే గ్రామ పంచాయతీ చార్జీల కింద రూ.4.44 లక్షలు, పర్మిట్ ఫీజు కింద రూ.10.44 లక్షలు, పచ్చదనం పెంపు కింద రూ.33 వేలు, డీపీఎంఎస్ యూజర్ చార్జీలు కింద రూ.500, లేబర్ సెస్ చార్జీలు కింద రూ.1.54 లక్షలు అంతా కలిపి రూ.17 లక్షల వరకూ టౌన్ ప్లానింగ్ విభాగానికి ఆన్‌లైన్‌లో చెల్లించాలి. మొత్తం ఫీజు చెల్లించిన తరువాతే బిల్డింగ్ ప్లాన్ అధికారి క్షేత్ర పర్యటన చేసి, ప్లాన్ అప్రూవ్ చేస్తారు. కానీ వైసీపీ నాయకులు కేవలం ప్లాన్ కోసం దరఖాస్తు చేసుకొని

... మిగతా 4వ పేజీలో

రేషన్ డీలర్ల పరేషాన్

- కార్యరూపం దాల్చని డిపోల రేషనలైజేషన్
- గత ప్రభుత్వంలో మోకాలడ్డిన వైసీపీ నేతలు
- కార్డుల కేటాయింపులో డిపోల మధ్య భారీ వ్యత్యాసం
- కొన్నిచోట్ల ఎక్కువ, మరికొన్నిచోట్ల మరీ తక్కువ
- కమీషన్ దుకాణం అద్దెకు కూడా సరిపోవడం లేదని ఆందోళన
- కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో ఉత్తర్వులు అమలుపై ఆశలు

విశాఖపట్నం, జూన్ 21 (ఆంధ్రజ్యోతి):



"నగరంలోని సర్కిల్-1లో గల డిపో నంబరు 247లో 354 బియ్యం కార్డులు మాత్రమే ఉన్నాయి. సర్కిల్-2లో 170వ నంబర్ డిపో పరిధిలో 588 కార్డులు ఉన్నాయి. అదే మధురవాడలోని డిపో నంబరు 413లో 1,826 కార్డులు, 410వ నంబర్ డిపో పరిధిలో 1,750 కార్డులు ఉన్నాయి. ఒకే డిపో పరిధిలో ఎక్కువ కార్డులు ఉండడం వల్ల సరకుల పంపిణీలో జాప్యం జరుగుతోంది. అదే సమయంలో తక్కువ కార్డులు ఉన్న డీలర్లకు ప్రభుత్వం నుంచి వచ్చే కమీషన్ కనీసం దుకాణం అద్దె, విద్యుత్ బిల్లులకు కూడా సరిపోవడం లేదు. డిపోల మధ్య వ్యత్యాసాలు సవరించాలి."

...ఇదీ రెండేళ్లుగా రేషన్ డీలర్ల వాదన

బియ్యం కార్డుల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని రేషన్ డిపోలను హేతుబద్ధీకరించాలని ప్రభుత్వం రెండేళ్ల క్రితం ఆదేశించింది. అయినా క్షేత్ర స్థాయిలో అమలు కాకపోవడంతో గత ఏడాది ఆగస్టులో మరోసారి గట్టిగా ఆదేశాలు ఇచ్చింది. దీంతో జిల్లాలో రేషన్ డిపోలు, ఎండీయూ వాహనాల పరిధిలో కార్డుల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని సర్వే చేశారు. పాత నగరంలో కొన్ని డిపోలు, అక్కయ్యపాలెం, రైల్వేన్యూకాలనీ, దొండపర్తి ఏరియాల్లో ఒక డిపో పరిధిలో 600, అంతకంటే తక్కువ కార్డులున్నాయి. వన్‌టౌన్ ఏరియాలో డిపో నంబర్ 247 పరిధిలో 354 కార్డులు మాత్రమే ఉన్నాయి. ఇంకా నగరం మధ్యలో ఉన్న ప్రాంతాల్లో 1000లోపు కార్డులున్న డిపోలు ఎక్కువగా ఉన్నాయి. అదే మధురవాడలోని డిపో నంబరు

... మిగతా 4వ పేజీలో

నయనానందం... వెంకన్న తెప్పోత్సవం



పోర్టు ప్రాంతంలో కొలువైన వెంకటేశ్వరస్వామికి శుక్రవారం తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం. (ఇన్‌సెట్‌లో) స్వామివారు -4లో

సందడిగా యోగా



అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఎంవీపీ కాలనీలోని జీవీఎంసీ ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనాలోఆసనాలు వేస్తున్న ఎంపీ శ్రీభరత్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, అడిషనల్ కమిషనర్ విశ్వనాథన్, జేసీ అశోక్ - వార్త IV పేజీలో

విశాఖ ఉక్కు ఆస్తుల విక్రయం సిగ్గుచేటు: సీఐటీయూ

జగదాంబ కూడలి, జూన్ 21: విశాఖ ఉక్కు ఆస్తుల విక్రయానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధపడడడం సిగ్గుచేటని, ఈ నేపథ్యంలో ఈ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదరి ఆర్‌కేఎస్‌వీ రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ముంబాయిలో విశాఖ ఉక్కుకు చెందిన అతిథి గృహాలు, స్టాక్ యార్డ్‌లకు చెందిన ఖరీదైన ఆస్తులను విక్రయించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఉక్కు ఆస్తుల విక్రయాన్ని నిలివేసి, కేంద్ర ప్రభుత్వం ఉక్కు ఫ్యాక్టరీకి అవసరమైన నిధులు సమకూర్చాలని హితవుపలికారు. లేకుంటే ఉద్యమించాల్సి ఉంటుందని హెచ్చరించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలిపేలా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

వంశీకృష్ణకు అభినందన


వంశీకృష్ణను సత్కరిస్తున్న జగదీష్

అక్కయ్యపాలెం, జూన్ 21: దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యేగా వంశీకృష్ణ శ్రీనివాస్, ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యేగా పి.విష్ణు కుమార్‌రాజు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా వారిని విశాఖ పార్లమెంటరీ టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అకిరెడ్డి జగదీష్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే సత్కరించారు.


యోగాసనాలు వేస్తున్న సిబ్బంది, పోలీసు అధికారులు


ఎన్‌జీజీఓస్ కాలనీ ఉన్నత పాఠశాలలో..

యోగా సాధనతో మనశ్శాంతి, ఆరోగ్యం

మహారాణిపేట, జూన్ 21: కేంద్ర సమాచార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బీచ్ రోడ్డులో ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శనను పార్లమెంట్ సభ్యుడు ఎం. శ్రీ భరత్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, యోగాను ప్రతీ ఒక్కరు క్రమం తప్పకుండా ఆచరించి శారీరక, మానసిక ఆరోగ్యం పొందాలని పిలుపు నిచ్చారు. యోగా సాధనతో క్రమ శిక్షణ అలవరుతుందన్నారు. ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ. నరసింహారావు, షఫీ మహ్మద్ , రమేష్ చంద్ర, టి.వి.ఆర్. చంద్ర పాల్గొన్నారు. ఫిషింగ్ హర్బర్ సమీపంలోని సీఐఎఫ్ఎన్ఈటీ యూనిట్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. మత్స్యకారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం బి.లక్ష్మీ నరస యోగాతో ఉపయోగాలను వివరించారు. పీడీ ఎ.సునంద్, యోగా టీచర్ విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. ఉపాధ్యాయులు మాణిక్యం, ఎంవీ ధర్మారావు, కిశోర్, రామలక్ష్మి, రాధిక, లలిత, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రిన్సిపాల్ ఆర్.మంజుల ఆధ్వరంలో నిర్వహించారు. బ్రహ్మకుమారీస్ సోదరి మాధురి విద్యార్థినులతో మెడిటేషన్ చేయించారు. జేసీఐ విశాఖ మెట్రో నుంచి గీతాగిరీష్, మాధవీలత విద్యార్థినులకు యోగా శిక్షణ అందించారు. ఇంటర్నేషనల్ యోగా ట్రైనర్ స్వాతి యోగా, కె.ఎల్.శిరీష, జె.లావణ్య, బి.హైమావతి, ఆర్.కిరణ్మయి పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: రైల్వేన్యూకాలనీలోని బ్రహ్మకుమారీల దీప్ భవన్‌లో యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా బీకే శశికళ బెహెన్‌జీ మాట్లాడుతూ ప్రతి రోజూ యోగా సాధనతోఆరోగ్యం సొంతమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు కబిలాష్ సింగ్ బాజీ, అంకిత, డాక్టర్ యశ్వంత్, శశికళ, నరేష్‌కుమార్, ఆచారి పాల్గొన్నారు.

జ్ఞానాపురం: స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలోని ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు, యోగా, క్రీడా విభాగాలు సంయుక్తంగా యోగా దినోత్సవం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె. మాణిక్య కుమారి, యోగా ఇన్‌చార్జి డి.రమేష్, పొలిటికల్ సైన్స్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్‌బాబు, యోగా శిక్షకురాలు డి.స్వాతి, ప్రిన్సిపాల్ డాక్టర్ షైజి, జర్నలిజం విభాగం అధ్యాపకురాలు బి.నవ్య పాల్గొన్నారు.

మురళీనగర్ ; మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్సు పార్కులో పార్కు కమిటీ అధ్వర్యంలో యోగా మాస్టర్ ఆధ్వర్యంలో కాలనీ వాసులు, మెంబర్లు యోగాసనాలు సాధన చేశారు. వైశాఖీపార్కు కమిటీ అధ్యక్షులు ససపల.వరప్రసాద్, ప్రముఖ న్యాయవాది పృథ్వీరాజ్ తదితరులు ఉన్నారు.

సీతమ్మధార: పీఅండ్‌టీ కాలనీలోని ఎన్‌ఎంసీహెచ్‌స్కూల్‌లో యోగా దినోత్సవం నిర్వహించారు. యోగా శిక్షకులు పైడి, పైడమ్మలు, ఉపాధ్యాయిని శారద, ఉపాధ్యాయులు, విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. హెచ్‌ఎం రాంప్రసాద్ పాల్గొన్నారు.


సీఐఎఫ్ఎన్ఈటీ ఆధర్యంలో యోగా దినోత్సవం

విశాఖపట్నం: వాల్తేరు రైల్వేలో యోగా దినోత్సవం జరిగింది. రైల్వే క్లబ్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి తూర్పుకోస్తారైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్, డీఆర్ఎం సౌరబ్‌ప్రసాద్ హాజరై యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ దేశ వారసత్వానికి యోగా నిదర్శనంగా నిలుస్తుందన్నారు. యోగాతో ఆరోగ్యకరమైన జీవనశైలి, మానసిక ఉల్లాసాన్ని పొందవచ్చునని పేర్కొన్నారు. అధికారులలతోపాటు వాల్తేరు రైల్వే మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు మంజుశ్రీ ప్రసాద్ పాల్గొన్నారు.

మహారాణిపేట: పోలీసు మైదానంలో దాదాపు 700 మంది సిబ్బందితో యోగాసనాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నగర పోలీసు ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ వారి ఫ్యాకల్టీ పర్యవేక్షణలో కమిషనర్ రవిశంకర్ అయ్యనార్, పోలీసు ఉన్నత అధికారుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ ఫకీరప్ప, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫ్యాకల్టీ టి.అరుణతో పాటు డీసీపీలు, ఏడీసీపీలు, సీఐ, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


రైల్వే క్లబ్‌లో ఆసనాలు వేస్తున్న ఉద్యోగులు


ఎన్ఎంసీహెచ్ స్కూల్‌లో యోగా సాధన చేస్తున్న చిన్నారులు


సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో విద్యార్థినులు


ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

పుస్తకాలు, బ్యాగులు పంపిణీ

పూర్ణామార్కెట్, జూన్ 21: పాఠశాల విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా గత ప్రభుత్వం జగన్ బొమ్మతో ముద్రించిన బ్యాగ్‌లు, పుస్తకాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పంపిణీకి అనుమతించి మేలు చేశారని టీడీపీ నాయకుడు, 39 వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు పేర్కొన్నారు. శుక్రవారం పూర్ణామార్కెట్ వద్ద ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం తరపున స్కూలు బ్యాగులు, పుస్తకాలను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం

జగదాంబ కూడలి, జూన్ 21: కనకమహాలక్ష్మికి శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజల్లో భాగంగా అర్చకులు ఉభయదాతలతో కలసి పాలతో అభిషేకం జరిపారు. వెండి కవచధారిణి అయిన అమ్మవారు ఈ అభిషేకంతో మరింత శ్వేత వర్ణంలో దర్శనమివ్వడంతో భక్తులు తన్మ యులయ్యాయి. ఆలయ సహాయ ఈవో రాంబాబు నేతృత్వంలో అర్చకులు ఈ ప్రత్యేక పూజలను నిర్వహించారు.

స్టీమ్ వాషింగ్ పరికరం వితరణ

అక్కయ్యపాలెం, జూన్ 21 : గ్రేటర్ 26వ వార్డు రామకృష్ణానగర్‌లోని రామలింగేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి అవసరమైన స్టీల్ కంచాలు, గ్లాసులు శుభ్ర పరిచేందుకు స్టీమ్ వాషింగ్ పరికరాన్ని విశాఖపట్నం జనరల్ మర్చంట్స్ చారిటబుల్ ట్రస్ట్ అందించింది. దీనిని ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు కుమార్తె శ్యామలాదీపిక శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్ తీగల వెంకట నాగేశ్వరరావు, సభ్యులు కలివరపు దాలిరాజు, ఆదారి వెంకట సత్య అప్పారావు, దారాల ఈశ్వరరావు, ఆల య మాజీ ఛైర్మన్ బొడ్డేటి రవికుమార్, కాళ్ల సూర్య ప్రకాష్, కర్రి జగన్నాధరావు, కేవీఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతపై అవగాహన అవసరం



ల్యాబ్ టెక్నీషియన్ల అవగాహన సదస్సులో పాల్గొన్న వైద్యులు

మహారాణిపేట, జూన్ 21: మెడికల్ ల్యాబ్‌ల్లో వైద్య పరీక్షలు నిర్వహించే టెక్నీషియన్లు ఆధునిక సాంకేతికపై అవ గాహన పెంపొందించుకోవాలని ప్రముఖ వైద్యులు ఉపేంద్ర శ్రీనివాస్ అన్నారు. ల్యాబ్ టెక్నీషియన్లకు శుక్రవారం జిల్లా పరిషత్ వద్ద క్వాంటమ్ సమావేశమందిరంలో వైద్య విజ్ఞాన సదస్సును (సీఎమ్ఈ ప్రోగ్రామ్) నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉపేం ద్ర శ్రీనివాస్ మాట్లాడుతూ మెడికల్ టెస్టుల నిర్వహణలో రోజురోజుకు ఆధునిక, సాంకేతిక పరికరాలు, నూతన విధానాలు వస్తున్నాయని, వాటి వినియోగంపై ప్రతీ ల్యాబ్ టెక్నీషియన్లు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో డాక్టర్ షుష్మా, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

పాఠశాలలో సినీ తారల సందడి


మాట్లాడుతున్న సినీ దర్శకుడు సముద్ర

అక్కయ్యపాలెం, జూన్ 21: సినీ తారలు శంకువానిపాలెంలోని వాగ్దేవి పాఠశాలను శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా సమాజంపై సినిమాల ప్రభావం, ప్రయోజనాలు ఏ విధంగా ఉంటాయో విద్యార్థులకు వివరించారు. కొంతమంది విద్యార్థులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. సినీ దర్శకుడు వి.సముద్ర మాట్లాడుతూ సినిమా కేవలం వినోదంకోసమే కాదని, సమాజానికి మేలు చేసే దిశగా కూడాపని చేస్తుందన్నారు. సినీతారలు సందర్శనతో విద్యార్థులు ఆనందం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు డాక్టర్ రవి శంకర్, హీరోయిన్లు అవ్యక్త, హనీబీ, గాయకులు రాము, పీయూష్ అంబోర్, శుభప్రదం నిర్మాత తిలక్, పాఠశాల ప్రిన్సిపాల్ ఎంవీవీ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఎంఎస్ఎల్ శైలజ తదితరులు పాల్గొన్నారు.


చంద్రమౌళీశ్వరస్వామి కల్యాణోత్సవం


షిర్డీసాయికి హారతి ఇస్తున్న అర్చకులు


అలంకరణలో కాటమ్మ, నాగమ్మ

వైభవంగా ఉమా చంద్రమౌళీశ్వరస్వామి కల్యాణం

డాబాగార్డెన్స్, జూన్ 21: డాబాగార్డెన్స్‌లోని శ్రీ ఉమా చంద్రమౌళీశ్వరస్వామి దేవాలయంలో స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవం కన్నులపండువగా జరిగింది. శుక్రవారం ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలను ఆలయ ఈవో జీవీ రమాబాయి సారథ్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. పంచామృత అభిషేకం, విశేష అలంకరణ, సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాలతో గ్రామ ప్రదక్షిణ నిర్వహించారు. అర్చకులు జి.భార్గవశర్మ శైవాగమ సంప్రదాయంలో మంగళధ్వని, వేద మం త్రాలతో కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాల్గొన్న దంపతులకు శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గురుదేవులు అక్కజోస్యుల రమేష్‌శర్మ, ఆలయ జేఏ కె.మన్మథరెడ్డి, ఆధ్యాత్మికవేత్త ఎం.రాజశేఖర్, సుకుమార్, భక్తులు పాల్గొన్నారు.

మాధవధార; మురళీనగర్ రామాలయంలో శుక్రవారం జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా షిర్డీ సాయి ఏకాహం నిర్వహించారు. ఆలయ కమిటీ సెక్రటరీ ససపల.వరప్రసాద్ మాట్లాడుతూ, శుక్రవారం సాయంత్రం 6 నుంచి శనివారం ఉదయం 7 గంటల వరకు నిర్విరామంగా సాయిరాం భజనలతో ఏకాహం సాగుతుందన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు నారాయణరెడ్డి, ఉపాధ్యక్షులు లక్ష్మణరావు ఉన్నారు.

ఘనంగా కాటమ్మ, నాగమ్మ అమ్మవార్ల పూజలు

సీతమ్మధార: నక్కవానిపాలెం, పీఅండ్‌టీ కాలనీ, గాంధీనగర్, టీపీటీ కాలనీ ప్రాంతాలకు చెందిన గ్రామ దేవతలు మామిడి చెట్టు కాటమ్మ, నాగమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవంను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రజలు అధిక సంఖ్యలో విచ్చేసి పసుపుకుంకుమలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవార్లను వెండిఆభరణాలు, పూల మాలలతో అలంకరించారు. మహిళలు ఆలయం వద్ద వెంకటేశ్వరస్వామి గీతాలకు కోలాటం ఆడారు. మహిళలకు కుర్చీలాట, పలు సంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. పూజ కార్యక్రమంలో భాగం గా భక్తులకు కాటమ్మఅమ్మవారి దేవాలయ సొసైటీ ఆధ్వర్యంలో అన్నప్రసాదం అందచేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సాడి పద్మరెడ్డి పాల్గొన్నారు.

గురువుల ఆరాధనోత్సవాలు ప్రారంభం

అక్కయ్యపాలెం: లలితానగర్‌లోని లలితాపీఠంలోగురువుల ఆరాధనోత్సవాలు ప్రారంభమయ్యా యి. ఈ మేరకు శక్తి పీఠాధీశ్వరి మంత్ర మహేశ్వరి మాతాజీ రమ్యానంద భారతీ స్వామిని ప్రవచనం కార్యక్రమం నిర్వహించారు. త్రిశక్తి వైభవం అనే అంశంపై మాతాజీ ప్రవచనం చేశారు. కుర్తాళం శంకరాచార్య సిద్ధేశ్వరానంద భారతీ మహా స్వామి సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శోభాయమానంగా వెంకటేశ్వరుని తెప్పోత్సవం

మహారాణిపేట,జూన్ 21: పోర్టు ఏరియా శృంగముని పర్వతంపై కొలువైన శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి తెప్పోత్సవం శుక్రవారం సాయంత్రం అత్యంత శోభాయమానంగా జరిగింది. స్వామి వారిని మంగళ వాద్యాలు, మేళ తాళాలతో ఉరేగింపుగా మెట్ల మార్గంలో కిందకు తీసుకువచ్చారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత స్వామి వారిని పల్లకిలో ఊరేగింపుగా సముద్ర తీరానికి తీసుకు వెళ్లారు. అప్పటికే పూలతో అలంకరించిన లాంచీలో అధిష్టింప జేసి సముద్రంలో విహారయాత్రగా తెప్పోత్సవాన్ని నిర్వహించారు. పెద్దఎత్తున విచ్చేసిన భక్తుల హరినామ సం కీర్తనలతో సాగరతీరం మారుమోగింది. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె. శిరిష, ఈవో శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు.

కేకే లైనులో రైల్వే జీఎం తనిఖీలు


మ్యాప్ పరిశీలిస్తున్న జీఎం పరమేశ్వర్ ఫంక్వాల్

విశాఖపట్నం, జూన్ 21: తూర్పుకోస్తారైల్వే జనరల్ మే నేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ శుక్రవారం కొత్తవలస- కిరండోల్ లైన్‌లో తనిఖీ చేపట్టారు. ట్రాఫిక్ సౌకర్యాల నిర్మాణ పనులు, మౌలిక సదుపాయల ప్రాజెక్టులను పరిశీలించారు. కార్గో నిర్వహణకు సంబంధించి సరకు రవాణా రైళ్ల సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు రూపొందించిన కార్యచరణ ప్రణాళికలపై సమీక్షించారు. ప్రాజెక్టు పనులను త్వరతగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కోరాపుట్, కిరండోల్ మార్గంలోని జైపూర్, కమ్లూర్, జగదల్‌పూర్ స్టేషన్లలో పర్యటించి ప్రయాణికుల మౌలిక సదుపాయాలు, వెయిటింగ్ హాల్స్ నిర్వహణ, స్టాల్స్‌తోపాటు సిబ్బంది లాబీలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను పరిశీలించారు. స్టేషన్ల అభివృద్ధి పనులపై సమీక్షించారు. అలాగే ఈ మార్గంలోని ట్రాక్స్, వంతెనలు, మలుపులు, టన్నెల్స్‌ల వద్ద భద్రతా చర్యలపై అధికారులతో సమీక్షించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పర్యటనలో డీఆర్ఎం సౌరబ్‌ప్రసాద్‌తోపాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

అప్పన్నకు ఆర్జిత నిత్య కల్యాణం

సింహాచలం, జూన్ 21 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత నిత్య కల్యాణం శుక్రవారం వైభవంగా నిర్వహిం చారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు జరిపారు.ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి, భక్తుల గోత్రనామాలతో సంకల్పించారు. అనంత రం కల్యాణ క్రతువు నిర్వహించారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

జిరాఫీ దత్తత

ఆరిలోవ, జూన్ 21 : నగరంలోని జూపార్కులో ఉన్న జిరాఫీల్లో ఒక జిరాఫీని ఫ్లూయంట్ గ్రిడ్ లిమిటెడ్ కంపెనీ దత్తత తీసుకుంది. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ మంగమ్మ మాట్లాడుతూ జంతువులను దత్తత తీసుకోవడం వల్ల ఆదాయం పన్ను మినహాయింపు ఉంటుందన్నారు. ప్రతిఒక్కరూ తమకు ఇష్టమైన జంతువులను దత్తత తీసుకోవడా నికి ముందుకు రావాలని కోరారు. అనంతరం ఫ్లూయంట్ గ్రిడ్ లిమిటెడ్ కంపెనీ సీనియర్ మేనేజర్ సీఎస్‌వీ రవికాంత్ జంతు దత్తత నిమిత్తం రూ. 1.80 లక్షల చెక్కును జూ క్యూరేటర్ మంగమ్మకు అందించారు.

కేజీహెచ్‌లో తాగునీటికి కటకట

... 3వ పేజీ తరువాయి

కొనుగోలు చేయడానికి ఆస్పత్రి అభివృద్ధి సొసైటీ అధ్యక్షులైన కలెక్టర్ అనుమతి ఇచ్చారు. టెండర్లు పిలిస్తే ఒకరు జీఎస్‌టీ లేనివారు, ఇంకొకరు వారెంటీ ఇవ్వలేమంటూ కొటేషన్లు వేశారు. దాంతో కొనుగోలు చేయలేదు. అప్పటి నుంచి ఇడ్లీ సరఫరా ఆగిపోయింది. 'ఆంధ్రజ్యోతి' ఈ విషయాన్ని వెలుగులోకి తీసుకురావడంతో అధికారులు ఆగమేఘాలపై ఇడ్లీ మెషీన్ కొనుగోలు కోసం చర్యలు చేపట్టారు. జూలై నుంచి వారానికి మూడు రోజులు ఇడ్లీ పెడతామని తెలిపారు.

నిబంధనల ప్రకారమే చేస్తున్నాం

సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద

'కేజీహెచ్‌లో ఇష్టారాజ్యం' శీర్షికతో శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనంపై సూపరింటెండెంట్ స్పందించారు. అన్నీ నిబంధనల ప్రకారమే చేస్తున్నామని చెప్పారు. ఆర్వోల నిర్మాణానికి రూ.32 లక్షలు మాత్రమే ఖర్చు చేశామని, ఆ పనులన్నీ వీఎంఆర్‌డీఏ చేస్తున్నదని, ఏపీఎంఎస్ఐడీసీకి సంబంధం లేదన్నారు. ఏసీలు కూడా 12 మాత్రమే కొనుగోలు చేశామని, వాటిని నిబంధనల ప్రకారమే తీసుకున్నామన్నారు. బ్యాటరీ కార్ల కొనుగోలు సరఫరా చేసిన సంస్థకు తయారీ సంస్థతో అనుబంధం ఉందని, ఏదైనా పాడైతే వారే బాగు చేస్తారన్నారు. అలాగే వివిధ విభాగాలకు అవసరమైన పరికరాలు దశల వారీగా అందుతున్నాయని, అందులో ఏమీ గోల్‌మాల్ జరగలేదన్నారు.

వైసీపీ దందా

... 3వ పేజీ తరువాయి

పనులు మొదలెట్టేశారు. వైసీపీ కార్యాలయ భవనానికి స్థలాన్ని కేటాయించవద్దంటూ స్థానికులు కోర్టులో వేసిన కేసు పెండింగ్‌లో ఉండగానే నిర్మాణం దాదాపు పూర్తిచేసేశారు. వైసీపీ రాజ్యసభ సభ్యుడికి చెందిన రాంకీ ఇన్‌ఫ్రా కంపెనీ ఈ భవన నిర్మాణం చేపట్టింది. అధికారాన్ని అడ్డం పెట్టుకొని నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన వైసీపీ కార్యాలయ పనులు నిలిపేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. భవన నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయా అని జీవీఎంసీ ఏసీపీ రామకృష్ణను 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి వివరణ కోరగా.గత ఏడాది ప్లాన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారని, అయితే ఇంకా అప్రూవ్ కాలేదని తెలిపారు.

స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేసినా...

ప్రభుత్వ స్థలాన్ని వైసీపీ కార్యాలయానికి కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ కొత్తూరు, నర్సింగరావుపేట, పోర్టు కాలనీ, సిరసపల్లి, సుబ్రహ్మణ్య కాలనీ వాసులు అప్పట్లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఎప్పటి నుంచో ఈ స్థలంలో కొంతభాగం సామాజిక అవసరాలకు కేటాయిస్తే కల్యాణ మండపం నిర్మించుకుంటామని వారు కోరుతున్నారు. రూ.కోట్లు విలువైన ప్రభుత్వ స్థలాన్ని ప్రజల అవసరాలకు వినియోగించాలే తప్ప పార్టీ కార్యాలయానికి ఏ విధంగా కేటాయిస్తారంటూ మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ కూడా కలెక్టరు రవి పట్టన్‌శెట్టికి, జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు కనీసం పట్టించు కోలేదు. జీవో 340 ప్రకారం స్థలాన్ని కేటాయించామని అప్పట్లో రెవెన్యూ అధికారులు చెప్పుకొచ్చారు. దీనిపై సంతృప్తి చెందని స్థానికులు 2023 జూన్ నెలలో హైకోర్టులో కేసు కూడా వేశారు.

రేషన్ డీలర్ల పరేషాన్

... 3వ పేజీ తరువాయి

413లో 1,825, డిపో నంబరు 410లో 1,750 కార్డులున్నాయి. మధురవాడ పరిధిలోని మొత్తం 30 డిపోల్లో రెండు తప్ప మిగిలిన డిపోల్లో 1,000, అంతకంటే ఎక్కువ కార్డులు ఉన్నాయి. అక్కడ మొత్తం 30 డిపోల్లో సుమారు 40 వేల కార్డులు ఉండగా, అక్కయ్యపాలెం, దొండపర్తి, రైల్వేన్యూకాలనీ, సీతంపేట, తదితర ప్రాంతాల్లో గల 30 డిపోల్లో 24 వేల కార్డులు మాత్రమే ఉన్నాయి. ఎండీయూ ఆపరేటర్ల ద్వారా సరకులు పంపిణీ చేసేటప్పుడు ప్రతి వాహనానికి సగటున 1,000 నుంచి 1,200 కార్డులు ఉండాలి. మధురవాడ, ఆరిలోవ ప్రాంతంలో ఎండీయూ పరిధిలో 1,500 నుంచి 1,800 వరకు కార్డులు అప్పగించారు. దీనివల్ల సరకుల పంపిణీలో తీవ్ర ఇబ్బందులు వస్తున్నాయని పౌర సరఫరాల అధికారులు గుర్తించారు. సర్వర్ ఇబ్బంది వచ్చినప్పుడు ఎక్కువగా కార్డులున్న చోట కార్డుదారులు రోజుల తరబడి సరకుల కోసం వేచి ఉండాల్సి వస్తోంది. ఇక తక్కువ కార్డులున్న చోట ప్రభుత్వం ఇచ్చే కమీషన్ షాపు అద్దెలు, కరెంట్ బిల్లులు, కూలీల జీతాలకు సరిపోవడం లేదని డీలర్లు అంటున్నారు. అదేవిధంగా ఎక్కువ కార్డులున్న ఎండీయూ ఆపరేటర్లు సుమారు 18 రోజులపాటు వీధుల్లో పనిచేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో కార్డుల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని రేషనలైజేషన్ చేయాలని పౌర సరఫరాల శాఖ గత ఏడాదే ప్రతిపాదించింది. అయితే వైసీపీ నేతలు కొందరు జోక్యం చేసుకుని డిపోల రేషనలైజేషన్ కాకుండా అడ్డుకున్నారు. అప్పటి జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ కూడా డిపోల రేషనలైజేషన్ చేయాలని ఆదేశించినా ఫలితం లేకుండా పోయింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన నేపథ్యంలో జిల్లాలో డిపోల రేషనలైజేషన్ ఆదేశాలు అమలు అయ్యేలా చూడాలని డీలర్లు కోరుతున్నారు.



నారికేళ జలాలతో అభిషేకం చేస్తున్న దృశ్యం

వెంకన్నకు జ్యేష్ఠాభిషేకం

పెందుర్తి, జూన్ 21: స్థానిక వెంకటాద్రి వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం జ్యేష్ఠపౌర్ణమి సందర్భంగా జ్యేష్ఠాభిషేకం నేత్రపర్వంగా నిర్వహించారు. వేకువజామున 1,008 కొబ్బరి బొండాలనుంచి సేకరించిన నీటితో అభిషేకం చేశారు. 27 కలశాలతో ఆవాహన చేశారు. ఆలయం చుట్టూ భక్తులు ప్రదక్షిణలు చేసి స్వామికి కొబ్బరికాయలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక అలంకరణ, మహా సరస్వతి హవనం నిర్వహించారు. విద్యార్థులు సరస్వతీదేవిని స్మరిస్తూ పూజలు చేశారు.

అక్రమ నిర్మాణాల పరిశీలన



గణేష్‌నగర్‌లో పర్యటిస్తున్న జెడ్సీ సన్యాసినాయుడు

కూర్మన్నపాలెం, జూన్ 21: జీవీఎంసీ 87 వార్డులో వైష్ణో గృహ సముదాయంలో అక్రమ నిర్మాణాలను శుక్రవారం జెడ్సీ సన్యాసి నాయుడు పరిశీలించారు. కాలనీవాసులు, కార్పొరేటర్ బొండా జగన్ కాలం చెల్లిన అనుమతులతో వైష్ణో యాజమాన్యం నిర్మాణాలు చేపడుతున్నట్టు ఫిర్యాదు చేశారు. అనంతరం జెడ్సీ మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఎవరు నిర్మాణాలు చేపట్టినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పలు కాలనీల్లో జెడ్సీ పర్యటించి ప్రజలనుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో విజయరామరాజు, రాజన్‌రాజు, శివయ్య, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం

ఎన్ఏడీ జంక్షన్, జూన్ 21: జీవీఎంసీ 57వ వార్డు ఎస్.వి.కె.నగర్‌లో శుక్రవారం ప్రమాదవశాత్తు గడ్డివాముకు మంటలు రేగాయి. పక్కన ఉన్న గుడిసెలకు వ్యాపించేలోగా స్థానికులు అదుపులోకి తీసుకువచ్చారు. ఫైర్ సిబ్బంది పూర్తిగా మంటలు ఆర్పారు. బాబ్‌కార్ట్‌తో పేరుకుపోయిన చెత్తను తొలగించారు.

స్టీల్‌ప్లాంట్ కార్మికుల నిరసనకు మద్దతు

వేపగుంట, జూన్ 21: విశాఖ ఉక్కు పరిరక్షణకోసం విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలో ఎంప్లాయిస్ యూనియన్ మాజీ కార్యదర్శి, కార్మిక నాయకుడు ఆడారి నాగరాజు పాల్గొని మద్దతు తెలిపారు. ప్లాంట్ పరిరక్షణపై స్పష్టమైన ప్రకటన చేసేవరకు ఉద్యమం కొనసాగేందుకు తమ వంతు సంఘీభావం, మద్దతు ఉంటుందని తెలియజేశారు.

మరికొన్ని సిటీ వార్తలు పేజీ IVలో..



యోగాపై వివరిస్తున్న డీపీఎస్ ప్రిన్సిపాల్ సమీర్‌కుమార్ పాండే



కణితి హైస్కూల్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



గోశాల కూడలిలో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో యోగసనాలు

సందడిగా యోగా దినోత్సవం

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 21: మానసిక, శారీరక ఆరోగ్యానికి యోగా సాధన చేయాలని స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్)ఎస్‌పీ.పాండే అన్నారు. ఉక్కు ఎంపీ హాల్‌లో శుక్రవారం జరిగిన యోగా వేడుకల్లో జీఎం (మెడికల్) నవీన్‌కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు. డీపీఎస్ స్కూల్‌లో యోగా ఆవశ్యకతను ప్రిన్సిపాల్ సమీర్‌కుమార్ పాండే వివరించారు. సృష్టి స్కూల్‌లో డైరెక్టర్ సుశీలారాణి, ఈడి మేఘన మాట్లాడారు. గాజువాకలో యోగా వేడుకలను బీజేపీ నేత కరణంరెడ్డి నరసింగరావు ప్రారంభించారు. ఆంధ్రకేసరి కళాక్షేత్రంలో డీసీపీ మేకా సత్తిబాబు, ఏసీపీ టి.త్రినాథ్, సీఐ వి.శ్రీనివాసరావు యోగాసనాలు వేశారు.

పెదగంట్యాడ: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎంఈవో ఇ.శ్రీనివాసరావు అన్నారు. భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలతో యోగా చేయించారు. రెండో ఎంఈవో కె.రమణాజీ, భవిత కేంద్రం ఉపాధ్యాయులు సూర్యనారాయణ, విజయభారతి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. దయాళ్‌నగర్‌లో విద్యార్థులకు యోగా శిక్షణ ఇచ్చారు. అనంతరం స్పెషల్ డైట్ అందజేశారు.

పెందుర్తి: సుజాతనగర్‌లోని ఫ్రెండ్స్ పవర్ వ్యవస్థాపకులు గురు రమణమూర్తి ఆధ్వర్యంలో సూరపనేని పాండురంగారావు యోగాసనాలను వేయించారు. చింతలగ్రహారంలోని పిరమిడ్ స్పిరిట్యుయల్ సంస్థ, పెందుర్తి లిటిల్ ఫ్లవర్స్ పాఠశాల లో యోగా డే నిర్వహించారు. గుర్రమ్మపాలెంలో ఉపాధి కూలీలు, ఎంపీటీసీ సభ్యురాలు గండ్రెడ్డి మాలతి, సర్పంచ్ ఉగ్గిన గోవిందరాజు యోగా చేశారు.

వేపగుంట: గోశాల కూడలిలో ఎస్‌వీఎల్ఎన్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. క్లబ్ అధ్యక్షుడు గొర్లె నాగార్జున, కార్యదర్శి పిట్టా శ్రీహరి, కోశాధికారి మల్లరామారావు, ఉపాధ్యక్షుడు లక్ష్మణరావు, ఎస్‌వీఆచారి, జాలి వాకర్ రామారావు, ఎస్.వి.రామకృష్ణ, రాజు పాల్గొన్నారు.

ఆటోనగర్: వాసివా కార్యాలయంలో ఎంఎస్ఎంఈ, వాసివా ఆధ్వర్యంలో యోగాభ్యాసాలు చేశారు. పారిశ్రామికవేత్తలు యోగాసనాలు వేశారు. వాసివా అధ్యక్షుడు సజ్జ పాండురంగ ప్రసాద్ అప్పలరాజును సత్కరించారు. ఎంఎస్ఎంఈ ఏడీ చంద్రమౌళి, ప్రభాకర్, ఐలా మాజీ చైర్మన్లు యార్లగడ్డ సాంబశివరావు, ఎన్.శేషగిరిరావు, వాసివా మాజీ అధ్యక్షుడు ఏకే బాలాజీ, రామప్రసాద్, ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు. శ్రీనగర్ టీఎస్సార్ టీటీకే కళాశాలలో యోగా దినోత్సవం నిర్వహించారు. డైరెక్టర్ తలశిల బలరామ కృష్ణ, ఉమా మహేశ్వరరావు, ప్రిన్సిపాల్ విష్ణువర్ధనరావు పాల్గొన్నారు. కణితి ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో యోగసనాలు వేయించారు. హెచ్ఎం సూర్యప్రకాష్, మన్నాజీ, రామశేషు, అరుణ, రత్నం, డీవీ నాయుడు, నారాయణ పాల్గొన్నారు. భరత్‌నగర్‌లో బొండా ఎల్లాజీ, శ్రీదేవి, గంధం భాస్కరరావు, కృష్ణవేణి, కృష్ణంరాజు, వెంకటరావు పాల్గొన్నారు. తిరుమలనగర్‌లో విశ్వేశ్వరరావు, నాగభూషణం, పరమానందం, పరమేశ్వరరావు తదితరులు యోగాసనాలు వేశారు.

మల్కాపురం: యోగాతో ఒత్తిడి తగ్గుతుందని యోగా శిక్షకురాలు ఎ.సంధ్యారాణి అన్నారు. సెయింట్ ఆన్స్ కళాశాలలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. సంధ్యారాణి, ఆదిలక్ష్మి, శివరంజని, వై.అనసూయాదేవి, నదియా, అంజలిదేవీ, అధ్యాపకులు జయశ్రీ, తులసి, ప్రిన్సిపాల్ ప్రేమకుమారి పాల్గొన్నారు. జింక్ మైదానంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కొక్కొలిగడ్డ విజయ్‌బాబు, లక్కరాజు రామకృష్ణ, శ్రీనివాసరావు, సతీష్, శ్రీరామ్మూర్తి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నం: నరవ బెహరా పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ వి.సుకన్య యోగా సాధనతో ఏకాగ్రత పెరుగుతుందన్నారు. ప్రోగ్రాం డైరెక్టర్లు ఎస్.కామేష్, కె.కామేశ్ పాల్గొన్నారు.

పెందుర్తిరూరల్: పతంజలి యోగ శిక్షణ కేంద్రం, ఆయుష్మాన్ దివ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో సుజాతనగర్ కల్యాణ మండపంలో కార్పొరేటరు ముమ్మన దేముడు యోగా ఆవశ్యకత వివరించారు. సుందరసింగ్, రాపర్తి శ్రీను పాల్గొన్నారు. పెదగాడిలో సామూహిక ధ్యాన తరగతులు నిర్వహించారు. కోరిబిల్లి రామారావు, సాయి, ధ్యానులు పాల్గొన్నారు.

అగనంపూడి: యోగా సాధనతో ఆరోగ్యం సొంతమవుతుందని హోమియోపతి వైద్యాధికారి కె.కళావతి పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యోగాసనాలు వేయించారు. ప్రిన్సిపాల్ జి. సుధాకర్, బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు చంద్రశేఖర్, సోమేశ్వరి, రామకోటి, బి. సత్యనారాయణ, హనుమంతరావు, వరహాలు, రవి, సిబ్బంది పాల్గొన్నారు. విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో రెక్టార్ యోగా గొప్పతనం వివరించారు. ప్రిన్సిపాల్ సుధాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని హోమియో వైద్యాధికారి ఆర్.శ్రీదేవి అన్నారు. మిందిలో యోగా శిక్షకులు కె.శ్రీను స్థానికులతో యోగాసనాలు వేయించారు. ఒ.వెంకటరావు, ఈటి వెంకటరావు, గురునాథరావు, పైడా రామారావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక హైస్కూల్‌లో యోగా దినోత్సవాన్ని హెచ్ఎం ఎంఎల్ఎస్ కాంతం ప్రారంభించారు. వ్యాయామోపాధ్యాయుడు మహ్మద్ ఇస్మాయల్ విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. భెల్ హెచ్‌పీవీపీ టౌన్‌షిప్‌లో భెల్ ఫ్రెండ్స్ పవర్ యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో గోపిశెట్టి ఆదినారాయణ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భెల్ కార్మికులతో పాటు వారి కుటుంబ సభ్యులు యోగాసనాలు వేశారు.



సుజాతనగర్‌లో యోగసనాలు వేస్తున్న మహిళలు



పెదగంట్యాడలో యోగసనాలు వేస్తున్న భవిత కేంద్రం విద్యార్థులు



మిందిలో యోగసనాలు వేస్తున్న విద్యార్థులు

ఉద్దేశ పూర్వకంగానే ఉక్కు కార్మికులకు జీతాలు నిలిపివేత

» పోరాట కమిటీ నాయకులు శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం, జూన్ 21: ఉక్కు కార్మికులకు యాజమాన్యం ఉద్దేశపూర్వకంగానే జీతాలు నిలిపివేస్తోందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు అన్నారు. కూర్మన్నపాలెంలో జరుగుతున్న రిలే దీక్షల్లో శుక్రవారం ఆయన మాట్లాడారు. ప్రతి నెలా ఏడో తేదీలోగా జీతాలు ఇవ్వాలని చట్టం నిర్దేశించనా యాజమాన్యం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గత నెల సుమారు రూ.1823 కోట్లు వ్యాపారం జరిగిందని, రూ.177 కోట్లు థర్డ్ పార్టీ పేమెంట్లు వచ్చాయన్నారు. ఈ నెల రూ.750 కోట్లు విక్రయాలు, 150 కోట్లు థర్డ్‌పార్టీ పేమెంట్లు జరిగినా యాజమాన్యం జీతాలు ఇవ్వడంలేదన్నారు. పోరాట కమిటీ చైర్మన్ ఆదినారాయణ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల్లో ఉక్కు కర్మాగారానికి వేల కోట్ల ఆస్తున్నాయని, వీటిని కేవలం రూ.450 కోట్లకు అమ్మేయడంపై సీబీఐకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నీరుకొండ రామచంద్రరావు, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న ఉక్కు కార్మికులు

స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించాలని ఎంపీకి వినతి



ఎంపీ శ్రీభరత్‌ను కలిసిన ఉక్కు ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్‌నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 21: విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ఎంపీ శ్రీభరత్‌ను ఉక్కు ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, ఉక్కు కార్మిక నాయకులు విళ్లా రామ్మోహన్‌కుమార్, టౌన్‌షిప్ టీడీపీ ఇన్‌చార్జి అడుసుమల్లి దీప్తి కోరారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, దీని ద్వారా అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. దీనిపై ఎంపీ సానుకూలంగా స్పందించి ప్లాంట్ పరిరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు

విద్యుత్ సమస్యలను తక్షణం పరిష్కరించండి

అగనంపూడి, జూన్ 21: గ్రేటర్ 79వ వార్డు పరిధి అగనంపూడి, లంకెలపాలెం, దేశపాత్రునిపాలెం పరిసర ప్రాంత గ్రామాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కంచాలని కోరుతూ కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ శుక్రవారం ఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణను కలిసి వినతి పత్రం అందజేశారు. గ్రామాల్లో లో ఓల్టేజీతో నివాసితులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. గృహ సముదాలు పెరుగుతున్నా అం దుకు తగినట్లు ట్రాన్స్‌పార్మర్లు ఏర్పాటు చేయక సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. తక్షణం ట్రాన్స్‌పార్మర్‌లను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈఈనీ కలిసి వారిలో టీడీపీ నాయకులు మాడిశ వెంకటరావు, సింగిడి సింహాచలం, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

టోల్‌గేటుకు విద్యుత్ కనెక్షన్ తొలగించాలి

నిబంధనలకు విరుద్ధంగా అగనంపూడి వద్ద కొనసాగుతున్న టోల్‌గేటుకు విద్యుత్ కన్‌క్షన్ తొలగించాలని కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ ఈఈ రామకృష్ణను కోరారు. హైకోర్టు ఉత్తర్వులతో టోల్‌గేటును 2019లో మూసివేశారని, వైసీపీ అధికారంలోని రాగానే తెరుచుకుందన్నారు. ఇది నేషనల్ హైవే కాదని ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్‌లకు అనుమతి ఇచ్చిందన్నారు. అలాంటప్పుడు హైవే టోల్‌గేట్ పేరిట విద్యుత్ కన్‌క్షన్ ఎలా కొనసాగిస్తున్నారని ప్రశ్నించారు. మాడిశ వెంకటరావు, సింగిడి సింహాచలం, రామారావు, నాగేశ్వరరావు, తదితరులున్నారు.



ఈఈ రామకృష్ణకు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్, తదితరులు



తాగునీటిని అందించే బావి వద్ద కొనసాగుతున్న పనులు

తాగునీటి సమస్యకు త్వరలో మోక్షం?

పెందుర్తిరూరల్, జూన్ 21: మండలంలోని చింతలఅగ్రహారం గ్రామంలో మూతపడిన రక్షిత పథకానికి మరమ్మతులు చేపట్టి తాగునీటి సరఫరా పునరుద్ధరణకు గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు, స్థానిక పంచాయతీ చర్యలు తీసుకుంటున్నారు. గ్రామంలో సుమారు 600కిపైగా నివాసాలు ఉన్నాయి. గ్రామస్తుల దాహార్తి తీర్చడానికి జాతీయ గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం నిధులతో ఇక్కడ రక్షిత మంచి నీటి పథకాన్ని ఏర్పాటు చేశారు. మేఘాద్రిగెడ్డలో తవ్విన బావినుంచి నీటిని శివాలయం వద్ద ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్ ద్వారా గ్రామస్తులకు తాగునీటి సరఫరా చేసేలా ఏర్పాట్లు చేశారు. అప్పట్లో ఈ పథకం చాలాకాలం బాగా పనిచేసింది. పూర్తిగా ఇసుక భాగంలో బావిని తవ్వడం పరిశుభ్రమైన తాగునీరు పుష్కలంగా అందుబాటులోకి రావడంతో పథకానికి, ప్రజలకు ఎటువంటి ఢోకా లేకుండా పోయింది.

రిజర్వాయర్ ఏర్పాటుతో గ్రహణం

1975లో ఇక్కడ మేఘాద్రిగెడ్డ రిజర్వాయర్ నిర్మాణంతో తాగునీటి పథకానికి గ్రహణం పట్టింది. బావి భాగం పూర్తిగా రిజర్వాయర్‌లో కలసిపోయింది.రిజర్వాయర్ నీటితో నిండినసమయంలో పంపు ఆపరేటర్ బావి వద్దకు వెళ్లి రావడానికి ఇబ్బంది నెలకొంది. దీంతో ప్రభుత్వ అధికారులు ఈ పథకాన్ని అలా వదిలేసి రిజర్వాయర్ గట్టు ఇవతలి భాగంలో మరో బావి తీయించి ఓవర్ హెడ్ ట్యాంక్‌కు పైపులైన్లు వేసి పథకాన్ని కొనసాగించారు. అయితే, కొత్తగా తవ్విన బావిలో పూర్తిగా ఉప్పునీరు కావడం వల్ల అవి తాగడానికి ఉపయోగపడలేదు. దీంతో మరోచోట రెండు బోర్లు, ఒక బావి తవ్వినా వీటిలో కూడా ఉప్పు నీరే కావడంతో సమస్య యథాతథంగా మారింది. అయితే, స్థానికుల చొరవ మేరకు జీవీఎంసీ అధికారులు గ్రామానికి ఇటీవల తాగునీటి పైపులైను కనెక్షన్ ఇచ్చారు. దీని ద్వారా వచ్చే నీరు ఏ మాత్రం చాలడం లేదు. కేవలం పది ఇళ్లకు మాత్రమే మొక్కుబడిగా అందించి మమ అనిపిస్తున్నారు. అదీ కూడా కొళాయి వద్దకు ఎవరు ముందు వస్తే వారికి మాత్రమే నీరు అందుతోంది. ఈ పరిస్థితిలో స్థానిక నాయకులు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పూర్వపు పథకాన్ని పునరుద్ధరించే దిశగా చర్యలు ప్రారంభమయ్యాయి. రిజర్వాయర్ నిండిన సమయంలో పంపు ఆపరేటర్‌కు ఇబ్బంది లేకుండా బావిలో సబ్‌మెర్సిబుల్ మోటారు ఏర్పాటు చేసి రిజర్వాయర్ గట్టు ఇవతల స్విచ్ ఏర్పాటు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. రిజర్వాయర్ గర్భంలో ఉన్న బావికి ఇప్పటికే మరమ్మతులు చేపట్టి సిమెంట్‌తో ప్లాసింగ్ పనులు కూడా చేపట్టారు. బావిలో పూడిక తీయించి రెండు మూడు రోజులలో పైపులైన్ల ఏర్పాటు ద్వారా గ్రామంలో గల కొళాయిలకు నీరు సరఫరా చేయడానికి చురుగ్గా పనులు సాగిస్తున్నారు.



విద్యుత్ సమస్యలపై నందమూరినగర్ కాలనీవాసుల నిరసన

గోపాలపట్నం, జూన్ 21: గ్రేటర్ 92వ వార్డు పరిధి నందమూరినగర్‌లో రెండేళ్లుగా విద్యుత్ లోవోల్టేజీ సమస్యపై కాలనీవాసులు స్థానిక ఈపీడీఎసీఎల్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసనకు దిగారు. కాలనీలో చాలా వీధుల్లో సింగిల్ ఫేజ్ విద్యుత్ లైన్లు ఉండటం, అవసరాలకు అనుగుణంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు లేక పోవడంతో రెండేళ్లుగా లోవోల్టేజీ సమస్యతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. అయితే, ఈ విషయంపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించక పోవడంతో విసిగిపోయిన వారు శుక్రవారం ఉదయం స్థానిక ఈపీడీసీఎల్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. అనంతరం అధికారులకు వినతపత్రం అందజేశారు. దీం తో స్పందించిన అధికారులు కాలనీలో లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి తాత్కాలిక చర్యలు చేపట్టారు.



గోపాలపట్నంలో ఈపీడీసీఎల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న నందమూరినగర్ కాలనీవాసులు

విశాఖ ఉక్కు ఆస్తుల విక్రయం సిగ్గుచేటు: సీఐటీయూ

జగదాంబ కూడలి, జూన్ 21: విశాఖ ఉక్కు ఆస్తుల విక్రయానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధపడడడం సిగ్గుచేటని, ఈ నేపథ్యంలో ఈ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదరి ఆర్‌కేఎస్‌వీ రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ముంబాయిలో విశాఖ ఉక్కుకు చెందిన అతిథి గృహాలు, స్టాక్ యార్డ్‌లకు చెందిన ఖరీదైన ఆస్తులను విక్రయించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఉక్కు ఆస్తుల విక్రయాన్ని నిలివేసి, కేంద్ర ప్రభుత్వం ఉక్కు ఫ్యాక్టరీకి అవసరమైన నిధులు సమకూర్చాలని హితవుపలికారు. లేకుంటే ఉద్యమించాల్సి ఉంటుందని హెచ్చరించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలిపేలా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

వంశీకృష్ణకు అభినందన


వంశీకృష్ణను సత్కరిస్తున్న జగదీష్

అక్కయ్యపాలెం, జూన్ 21: దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యేగా వంశీకృష్ణ శ్రీనివాస్, ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యేగా పి.విష్ణు కుమార్‌రాజు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా వారిని విశాఖ పార్లమెంటరీ టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అకిరెడ్డి జగదీష్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే సత్కరించారు.


యోగాసనాలు వేస్తున్న సిబ్బంది, పోలీసు అధికారులు


ఎన్‌జీజీఓస్ కాలనీ ఉన్నత పాఠశాలలో..

యోగా సాధనతో మనశ్శాంతి, ఆరోగ్యం

మహారాణిపేట, జూన్ 21: కేంద్ర సమాచార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బీచ్ రోడ్డులో ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శనను పార్లమెంట్ సభ్యుడు ఎం. శ్రీ భరత్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, యోగాను ప్రతీ ఒక్కరు క్రమం తప్పకుండా ఆచరించి శారీరక, మానసిక ఆరోగ్యం పొందాలని పిలుపు నిచ్చారు. యోగా సాధనతో క్రమ శిక్షణ అలవరుతుందన్నారు. ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ. నరసింహారావు, షఫీ మహ్మద్ , రమేష్ చంద్ర, టి.వి.ఆర్. చంద్ర పాల్గొన్నారు. ఫిషింగ్ హార్బర్ సమీపంలోని సీఐఎఫ్ఎన్ఈటీ యూనిట్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. మత్స్యకారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం బి.లక్ష్మీ నరస యోగాతో ఉపయోగాలను వివరించారు. పీడీ ఎ.సునంద్, యోగా టీచర్ విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. ఉపాధ్యాయులు మాణిక్యం, ఎంవీ ధర్మారావు, కిశోర్, రామలక్ష్మి, రాధిక, లలిత, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రిన్సిపాల్ ఆర్.మంజుల ఆధ్వరంలో నిర్వహించారు. బ్రహ్మకుమారీస్ సోదరి మాధురి విద్యార్థినులతో మెడిటేషన్ చేయించారు. జేసీఐ విశాఖ మెట్రో నుంచి గీతాగిరీష్, మాధవీలత విద్యార్థినులకు యోగా శిక్షణ అందించారు. ఇంటర్నేషనల్ యోగా ట్రైనర్ స్వాతి యోగా, కె.ఎల్.శిరీష, జె.లావణ్య, బి.హైమావతి, ఆర్.కిరణ్మయి పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: రైల్వేన్యూకాలనీలోని బ్రహ్మకుమారీల దీప్ భవన్‌లో యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా బీకే శశికళ బెహెన్‌జీ మాట్లాడుతూ ప్రతి రోజూ యోగా సాధనతోఆరోగ్యం సొంతమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు కబిలాష్ సింగ్ బాజీ, అంకిత, డాక్టర్ యశ్వంత్, శశికళ, నరేష్‌కుమార్, ఆచారి పాల్గొన్నారు.

జ్ఞానాపురం: స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలోని ఎన్ఎస్ఎస్ యూనిట్లు, యోగా, క్రీడా విభాగాలు సంయుక్తంగా యోగా దినోత్సవం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె. మాణిక్య కుమారి, యోగా ఇన్‌చార్జి డి.రమేష్, పొలిటికల్ సైన్స్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్‌బాబు, యోగా శిక్షకురాలు డి.స్వాతి, ప్రిన్సిపాల్ డాక్టర్ షైజి, జర్నలిజం విభాగం అధ్యాపకురాలు బి.నవ్య పాల్గొన్నారు.

మురళీనగర్ ; మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్స్ పార్కులో పార్కు కమిటీ అధ్వర్యంలో యోగా మాస్టర్ ఆధ్వర్యంలో కాలనీ వాసులు, మెంబర్లు యోగాసనాలు సాధన చేశారు. వైశాఖీపార్కు కమిటీ అధ్యక్షులు సనపల.వరప్రసాద్, ప్రముఖ న్యాయవాది పృథ్వీరాజ్ తదితరులు ఉన్నారు.

సీతమ్మధార: పీఅండ్‌టీ కాలనీలోని ఎన్ఎంసీహెచ్‌స్కూల్‌లో యోగా దినోత్సవం నిర్వహించారు. యోగా శిక్షకులు పైడి, పైడమ్మలు, ఉపాధ్యాయిని శారద, ఉపాధ్యాయులు, విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. హెచ్‌ఎం రాంప్రసాద్ పాల్గొన్నారు.


సీఐఎఫ్ఎన్ఈటీ ఆధర్యంలో యోగా దినోత్సవం

విశాఖపట్నం: వాల్తేరు రైల్వేలో యోగా దినోత్సవం జరిగింది. రైల్వే క్లబ్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి తూర్పుకోస్తారైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్, డీఆర్ఎం సౌరబ్‌ప్రసాద్ హాజరై యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ దేశ వారసత్వానికి యోగా నిదర్శనంగా నిలుస్తుందన్నారు. యోగాతో ఆరోగ్యకరమైన జీవనశైలి, మానసిక ఉల్లాసాన్ని పొందవచ్చునని పేర్కొన్నారు. అధికారులలతోపాటు వాల్తేరు రైల్వే మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు మంజుశ్రీ ప్రసాద్ పాల్గొన్నారు.

మహారాణిపేట: పోలీసు మైదానంలో దాదాపు 700 మంది సిబ్బందితో యోగాసనాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నగర పోలీసు ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ వారి ఫ్యాకల్టీ పర్యవేక్షణలో కమిషనర్ రవిశంకర్ అయ్యనార్, పోలీసు ఉన్నత అధికారుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ ఫకీరప్ప, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫ్యాకల్టీ టి.అరుణతో పాటు డీసీపీలు, ఏడీసీపీలు, సీఐ, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


రైల్వే క్లబ్‌లో ఆసనాలు వేస్తున్న ఉద్యోగులు


ఎస్ఎంసీహెచ్ స్కూల్‌లో యోగా సాధన చేస్తున్న చిన్నారులు


సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో విద్యార్థినులు


ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

పుస్తకాలు, బ్యాగులు పంపిణీ

పూర్ణామార్కెట్, జూన్ 21: పాఠశాల విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా గత ప్రభుత్వం జగన్ బొమ్మతో ముద్రించిన బ్యాగ్‌లు, పుస్తకాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పంపిణీకి అనుమతించి మేలు చేశారని టీడీపీ నాయకుడు, 39 వార్డు కార్పొరేటర్ విల్లూరి బాస్కరరావు పేర్కొన్నారు. శుక్రవారం పూర్ణామార్కెట్ వద్ద ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం తరఫున స్కూలు బ్యాగులు, పుస్తకాలను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం

జగదాంబ కూడలి, జూన్ 21: కనకమహాలక్ష్మికి శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజల్లో భాగంగా అర్చకులు ఉభయదాతలతో కలసి పాలతో అభిషేకం జరిపారు. వెండి కవచధారిణి అయిన అమ్మవారు ఈ అభిషేకంతో మరింత శ్వేత వర్ణంలో దర్శనమివ్వడంతో భక్తులు తన్మ యులయ్యాయి. ఆలయ సహాయ ఈవో రాంబాబు నేతృత్వంలో అర్చకులు ఈ ప్రత్యేక పూజలను నిర్వహించారు.

స్టీమ్ వాషింగ్ పరికరం వితరణ

అక్కయ్యపాలెం, జూన్ 21 : గ్రేటర్ 26వ వార్డు రామకృష్ణానగర్‌లోని రామలింగేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి అవసరమైన స్టీల్ కంచాలు, గ్లాసులు శుభ్ర పరిచేందుకు స్టీమ్ వాషింగ్ పరికరాన్ని విశాఖపట్నం జనరల్ మర్చంట్స్ చారిటబుల్ ట్రస్ట్ అందించింది. దీనిని ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు కుమార్తె శ్యామలాదీపిక శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ తీగల వెంకట నాగేశ్వరరావు, సభ్యులు కలివరపు దాలిరాజు, ఆడారి వెంకట సత్య అప్పారావు, దారాల ఈశ్వరరావు, ఆల య మాజీ చైర్మన్ బొడ్డేటి రవికుమార్, కాళ్ల సూర్య ప్రకాష్, కర్రి జగన్నాధరావు, కేవీఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతపై అవగాహన అవసరం


ల్యాబ్ టెక్నీషియన్ల అవగాహన సదస్సులో పాల్గొన్న వైద్యులు

మహారాణిపేట, జూన్ 21: మెడికల్ ల్యాబ్‌ల్లో వైద్య పరీక్షలు నిర్వహించే టెక్నీషియన్లు ఆధునిక సాంకేతికపై అవ గాహన పెంపొందించుకోవాలని ప్రముఖ వైద్యులు ఉపేంద్ర శ్రీనివాస్ అన్నారు. ల్యాబ్ టెక్నీషియన్లకు శుక్రవారం జిల్లా పరిషత్ వద్ద క్వాంటమ్ సమావేశమందిరంలో వైద్య విజ్ఞాన సదస్సును (సీఎమ్ఈ ప్రోగ్రామ్) నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉపేం ద్ర శ్రీనివాస్ మాట్లాడుతూ మెడికల్ టెస్టుల నిర్వహణలో రోజురోజుకు ఆధునిక, సాంకేతిక పరికరాలు, నూతన విధానాలు వస్తున్నాయని, వాటి వినియోగంపై ప్రతీ ల్యాబ్ టెక్నీషియన్లు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో డాక్టర్ షుష్మా, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

పాఠశాలలో సినీ తారల సందడి


మాట్లాడుతున్న సినీ దర్శకుడు సముద్ర

అక్కయ్యపాలెం, జూన్ 21: సినీ తారలు శంకువానిపాలెంలోని వాగ్దేవి పాఠశాలను శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా సమాజంపై సినిమాల ప్రభావం, ప్రయోజనాలు ఏ విధంగా ఉంటాయో విద్యార్థులకు వివరించారు. కొంతమంది విద్యార్థులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. సినీ దర్శకుడు వి.సముద్ర మాట్లాడుతూ సినిమా కేవలం వినోదంకోసమే కాదని, సమాజానికి మేలు చేసే దిశగా కూడాపని చేస్తుందన్నారు. సినీతారలు సందర్శనతో విద్యార్థులు ఆనందం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు డాక్టర్ రవిశంకర్, హీరోయిన్లు అవ్యక్త, హనీబీ, గాయకులు రాము, పీయూష్ అంబోర్, శుభప్రదం నిర్మాత తిలక్, పాఠశాల ప్రిన్సిపాల్ ఎంవీవీ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఎంఎస్ఎల్ శైలజ తదితరులు పాల్గొన్నారు.


చంద్రమౌళీశ్వరస్వామి కల్యాణోత్సవం


షిర్డీసాయికి హారతి ఇస్తున్న అర్చకులు


అలంకరణలో కాటమ్మ, నాగమ్మ

వైభవంగా ఉమా చంద్రమౌళీశ్వరస్వామి కల్యాణం

డాబాగార్డెన్స్, జూన్ 21: డాబాగార్డెన్స్‌లోని శ్రీ ఉమా చంద్రమౌళీశ్వరస్వామి దేవాలయంలో స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవం కన్నులపండువగా జరిగింది. శుక్రవారం ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలను ఆలయ ఈవో జీవీ రమాబాయి సారథ్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. పంచామృత అభిషేకం, విశేష అలంకరణ, సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాలతో గ్రామ ప్రదక్షిణ నిర్వహించారు. అర్చకులు జి.భార్గవశర్మ శైవాగమ సంప్రదాయంలో మంగళధ్వని, వేద మం త్రాలతో కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాల్గొన్న దంపతులకు శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గురుదేవులు అక్కజోష్యుల రమేష్‌శర్మ, ఆలయ జేఏ కె.మన్మథరెడ్డి, ఆధ్యాత్మికవేత్త ఎం.రాజశేఖర్, సుకుమార్, భక్తులు పాల్గొన్నారు.

మాధవధార; మురళీనగర్ రామాలయంలో శుక్రవారం జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా షిర్డీ సాయి ఏకాహం నిర్వహించారు. ఆలయ కమిటీ సెక్రటరీ సనపల.వరప్రసాద్ మాట్లాడుతూ, శుక్రవారం సాయంత్రం 6 నుంచి శనివారం ఉదయం 7 గంటల వరకు నిర్విరామంగా సాయిరాం భజనలతో ఏకాహం సాగుతుందన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు నారాయణరెడ్డి, ఉపాధ్యక్షులు లక్ష్మణరావు ఉన్నారు.

ఘనంగా కాటమ్మ, నాగమ్మ అమ్మవార్ల పూజలు

సీతమ్మధార: నక్కవానిపాలెం, పీఅండ్‌టీ కాలనీ, గాంధీనగర్, టీపీటీ కాలనీ ప్రాంతాలకు చెందిన గ్రామ దేవతలు మామిడి చెట్టు కాటమ్మ, నాగమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవంను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రజలు అధిక సంఖ్యలో విచ్చేసి పసుపుకుంకుమలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవార్లను వెండిఆభరణాలు, పూలమాలలతో అలంకరించారు. మహిళలు ఆలయం వద్ద వెంకటేశ్వరస్వామి గీతాలకు కోలాటం ఆడారు. మహిళలకు కుర్చీలాట, పలు సంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. పూజ కార్యక్రమంలో భాగం గా భకుల్తకు కాటమ్మఅమ్మవారి దేవాలయ సొసైటీ ఆధ్వర్యంలో అన్నప్రసాదం అందచేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సాడి పద్మరెడ్డి పాల్గొన్నారు.

గురువుల ఆరాధనోత్సవాలు ప్రారంభం

అక్కయ్యపాలెం: లలితానగర్‌లోని లలితాపీఠంలోగురువుల ఆరాధనోత్సవాలు ప్రారంభమయ్యా యి. ఈ మేరకు శక్తి పీఠాధీశ్వరి మంత్ర మహేశ్వరి మాతాజీ రమ్యానంద భారతీ స్వామిని ప్రవచనం కార్యక్రమం నిర్వహించారు. త్రిశక్తి వైభవం అనే అంశంపై మాతాజీ ప్రవచనం చేశారు. కుర్తాళం శంకరాచార్య సిద్ధేశ్వరానంద భారతీ మహా స్వామి సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శోభాయమానంగా వెంకటేశ్వరుని తెప్పోత్సవం

మహారాణిపేట,జూన్ 21: పోర్టు ఏరియా శృంగముని పర్వతంపై కొలువైన శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి తెప్పోత్సవం శుక్రవారం సాయంత్రం అత్యంత శోభాయమానంగా జరిగింది. స్వామి వారిని మంగళ వాద్యాలు, మేళ తాళాలతో ఊరేగింపుగా మెట్ల మార్గంలో కిందకు తీసుకువచ్చారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత స్వామి వారిని పల్లకిలో ఊరేగింపుగా సముద్ర తీరానికి తీసుకు వెళ్లారు. అప్పటికే పూలతో అలంకరించిన లాంచీలో అధిష్టింప జేసి సముద్రంలో విహారయాత్రగా తెప్పోత్సవాన్ని నిర్వహించారు. పెద్దఎత్తున విచ్చేసిన భక్తుల హరినామ సం కీర్తనలతో సాగరతీరం మారుమోగింది. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె. శిరీష, ఈవో శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు.

కేకే లైనులో రైల్వే జీఎం తనిఖీలు


మ్యాప్ పరిశీలిస్తున్న జీఎం పరమేశ్వర్ ఫంక్వాల్

విశాఖపట్నం, జూన్ 21: తూర్పుకోస్తారైల్వే జనరల్ మే నేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ శుక్రవారం కొత్తవలస- కిరండోల్ లైన్‌లో తనిఖీ చేపట్టారు. ట్రాఫిక్ సౌకర్యాల నిర్మాణ పనులు, మౌలిక సదుపాయల ప్రాజెక్టులను పరిశీలించారు. కార్గో నిర్వహణకు సంబంధించి సరకు రవాణా రైళ్ల సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు రూపొందించిన కార్యచరణ ప్రణాళికలపై సమీక్షించారు. ప్రాజెక్టు పనులను త్వరతగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కోరాపుట్, కిరండోల్ మార్గంలోని జైపూర్, కమ్లూర్, జగదల్‌పూర్ స్టేషన్లలో పర్యటించి ప్రయాణికుల మౌలిక సదుపాయాలు, వెయిటింగ్ హాల్స్ నిర్వహణ, స్టాల్స్‌తోపాటు సిబ్బంది లాబీలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను పరిశీలించారు. స్టేషన్ల అభివృద్ధి పనులపై సమీక్షించారు. అలాగే ఈ మార్గంలోని ట్రాక్స్, వంతెనలు, మలుపులు, టన్నెల్స్‌ల వద్ద భద్రతా చర్యలపై అధికారులతో సమీక్షించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పర్యటనలో డీఆర్ఎం సౌరబ్‌ప్రసాద్‌తోపాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

అప్పన్నకు ఆర్జిత నిత్య కల్యాణం

సింహాచలం, జూన్ 21 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత నిత్య కల్యాణం శుక్రవారం వైభవంగా నిర్వహిం చారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు జరిపారు.ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్టింపజేసి, భక్తుల గోత్రనామాలతో సంకల్పించారు. అనంత రం కల్యాణ క్రతువు నిర్వహించారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

జిరాఫీ దత్తత

ఆరిలోవ, జూన్ 21 : నగరంలోని జూపార్కులో ఉన్న జిరాఫీల్లో ఒక జిరాఫీని ఫ్లూయంట్ గ్రిడ్ లిమిటెడ్ కంపెనీ దత్తత తీసుకుంది. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ మంగమ్మ మాట్లాడుతూ జంతువులను దత్తత తీసుకోవడం వల్ల ఆదాయం పన్ను మినహాయింపు ఉంటుందన్నారు. ప్రతిఒక్కరూ తమకు ఇష్టమైన జంతువులను దత్తత తీసుకోవడా నికి ముందుకు రావాలని కోరారు. అనంతరం ఫ్లూయంట్ గ్రిడ్ లిమిటెడ్ కంపెనీ సీనియర్ మేనేజర్ సీఎస్‌వీ రవికాంత్ జంతు దత్తత నిమిత్తం రూ. 1.80 లక్షల చెక్కును జూ క్యూరేటర్ మంగమ్మకు అందించారు.

కేజీహెచ్‌లో తాగునీటికి కటకట

... 3వ పేజీ తరువాయి

కొనుగోలు చేయడానికి ఆస్పత్రి అభివృద్ధి సొసైటీ అధ్యక్షులైన కలెక్టర్ అనుమతి ఇచ్చారు. టెండర్లు పిలిస్తే ఒకరు జీఎస్టీ లేనివారు, ఇంకొకరు వారెంటీ ఇవ్వలేమంటూ కొటేషన్లు వేశారు. దాంతో కొనుగోలు చేయలేదు. అప్పటి నుంచి ఇడ్లీ సరఫరా ఆగిపోయింది. 'ఆంధ్రజ్యోతి' ఈ విషయాన్ని వెలుగులోకి తీసుకురావడంతో అధికారులు ఆగమేఘాలపై ఇడ్లీ మెషీన్ కొనుగోలు కోసం చర్యలు చేపట్టారు. జూలై నుంచి వారానికి మూడు రోజులు ఇడ్లీ పెడతామని తెలిపారు.

నిబంధనల ప్రకారమే చేస్తున్నాం

సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద

'కేజీహెచ్‌లో ఇష్టారాజ్యం' శీర్షికతో శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనంపై సూపరింటెండెంట్ స్పందించారు. అన్నీ నిబంధనల ప్రకారమే చేస్తున్నామని చెప్పారు. ఆర్బీల నిర్మాణానికి రూ.32 లక్షలు మాత్రమే ఖర్చు చేశామని, ఆ పనులన్నీ వీఎంఆర్‌డీఏ చేస్తున్నదని, ఏపీఎంఎస్ఐడీసీకి సంబంధం లేదన్నారు. ఏసీలు కూడా 12 మాత్రమే కొనుగోలు చేశామని, వాటిని నిబంధనల ప్రకారమే తీసుకున్నామన్నారు. బ్యాటరీ కార్ల కొనుగోలు సరఫరా చేసిన సంస్థకు తయారీ సంస్థతో అనుబంధం ఉందని, ఏదైనా పాడైతే వారే బాగు చేస్తారన్నారు. అలాగే వివిధ విభాగాలకు అవసరమైన పరికరాలు దశల వారీగా అందుతున్నాయని, అందులో ఏమీ గోల్‌మాల్ జరగలేదన్నారు.

వైసీపీ దందా

... 3వ పేజీ తరువాయి

పనులు మొదలెట్టేశారు. వైసీపీ కార్యాలయ భవనానికి స్థలాన్ని కేటాయించవద్దంటూ స్థానికులు కోర్టులో వేసిన కేసు పెండింగ్‌లో ఉండగానే నిర్మాణం దాదాపు పూర్తిచేసేశారు. వైసీపీ రాజ్యసభ సభ్యుడికి చెందిన రాంకీ ఇన్‌ఫ్రా కంపెనీ ఈ భవన నిర్మాణం చేపట్టింది. అధికారాన్ని అడ్డం పెట్టుకొని నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన వైసీపీ కార్యాలయ పనులు నిలిపేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. భవన నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయా అని జీవీఎంసీ ఏసీపీ రామకృష్ణను 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి వివరణ కోరగా..గత ఏడాది ప్లాన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారని, అయితే ఇంకా అప్రూవ్ కాలేదని తెలిపారు.

స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేసినా...

ప్రభుత్వ స్థలాన్ని వైసీపీ కార్యాలయానికి కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ కొత్తూరు, నర్సింగరావుపేట, పోర్టు కాలనీ, సిరసపల్లి, సుబ్రహ్మణ్య కాలనీ వాసులు అప్పట్లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఎప్పటి నుంచో ఈ స్థలంలో కొంతభాగం సామాజిక అవసరాలకు కేటాయిస్తే కల్యాణ మండపం నిర్మించుకుంటామని వారు కోరుతున్నారు. రూ.కోట్లు విలువైన ప్రభుత్వ స్థలాన్ని ప్రజల అవసరాలకు వినియోగించాలే తప్ప పార్టీ కార్యాలయానికి ఏ విధంగా కేటాయిస్తారంటూ మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ కూడా కలెక్టరు రవి పట్టన్‌శెట్టికి, జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు కనీసం పట్టించు కోలేదు. జీవో 340 ప్రకారం స్థలాన్ని కేటాయించామని అప్పట్లో రెవెన్యూ అధికారులు చెప్పుకొచ్చారు. దీనిపై సంతృప్తి చెందని స్థానికులు 2023 జూన్ నెలలో హైకోర్టులో కేసు కూడా వేశారు.

రేషన్ డీలర్ల పరేషాన్


... 3వ పేజీ తరువాయి

413లో 1,825, డిపో నంబరు 410లో 1,750 కార్డులున్నాయి. మధురవాడ పరిధిలోని మొత్తం 30 డిపోల్లో రెండు తప్ప మిగిలిన డిపోల్లో 1,000, అంతకంటే ఎక్కువ కార్డులు ఉన్నాయి. అక్కడ మొత్తం 30 డిపోల్లో సుమారు 40 వేల కార్డులు ఉండగా, అక్కయ్యపాలెం, దొండపర్తి, రైల్వేన్యూకాలనీ, సీతంపేట, తదితర ప్రాంతాల్లో గల 30 డిపోల్లో 24 వేల కార్డులు మాత్రమే ఉన్నాయి. ఎండీయూ ఆపరేటర్ల ద్వారా సరకులు పంపిణీ చేసేటప్పుడు ప్రతి వాహనానికి సగటున 1,000 నుంచి 1,200 కార్డులు ఉండాలి. మధురవాడ, ఆరిలోవ ప్రాంతంలో ఎండీయూ పరిధిలో 1,500 నుంచి 1,800 వరకు కార్డులు అప్పగించారు. దీనివల్ల సరకుల పంపిణీలో తీవ్ర ఇబ్బందులు వస్తున్నాయని పౌర సరఫరాల అధికారులు గుర్తించారు. సర్వర్ ఇబ్బంది వచ్చినప్పుడు ఎక్కువగా కార్డులున్న చోట కార్డుదారులు రోజుల తరబడి సరకుల కోసం వేచి ఉండాల్సి వస్తోంది. ఇక తక్కువ కార్డులున్న చోట ప్రభుత్వం ఇచ్చే కమీషన్ షాపు అద్దెలు, కరెంట్ బిల్లులు, కూలీల జీతాలకు సరిపోవడం లేదని డీలర్లు అంటున్నారు. అదేవిధంగా ఎక్కువ కార్డులున్న ఎండీయూ ఆపరేటర్లు సుమారు 18 రోజులపాటు వీధుల్లో పనిచేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో కార్డుల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని రేషనలైజేషన్ చేయాలని పౌర సరఫరాల శాఖ గత ఏడాదే ప్రతిపాదించింది. అయితే వైసీపీ నేతలు కొందరు జోక్యం చేసుకుని డిపోల రేషనలైజేషన్ కాకుండా అడ్డుకున్నారు. అప్పటి జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ కూడా డిపోల రేషనలైజేషన్ చేయాలని ఆదేశించినా ఫలితం లేకుండా పోయింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన నేపథ్యంలో జిల్లాలో డిపోల రేషనలైజేషన్ ఆదేశాలు అమలు అయ్యేలా చూడాలని డీలర్లు కోరుతున్నారు.

అక్రమ నిర్మాణం తొలగింపు

భీమునిపట్నం, జూన్ 21 : తిమ్మాపురం తొట్లకొండ ఏటవాలు ప్రదేశంలో కొందరు వ్యక్తులు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ఇంటి నిర్మాణానికి వేసిన పునాదులను రెవెన్యూ అధికారులు శుక్రవారం తొలగించారు. తిమ్మాపురం జంక్షన్ నుంచి మారికవలస వెళ్లే వంద అడుగుల రహదారిలో కుడి వైపు ఉన్న ప్రభుత్వ స్థలాన్ని చదును చేసి కొందరు వ్యక్తులు సిమ్మెంట్ ఇటుకలతో ఇంటి నిర్మాణం చేపడుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ గోవిందకు ఫిర్యాదు రావడంతో ఆయన ఆదేశాల మేరకు సిబ్బంది నిర్మాణాన్ని తొలగించారు.

మరికొన్ని సిటీ వార్తలు | పేజీ IVలో..





సాగర్‌నగర్ బీచ్‌లో ఎన్‌సీసీ క్యాడెట్ల యోగాసనాలు



కైలాసగిరి రిజర్వు పోలీసు మైదానంలో యోగాసనాలు వేస్తున్న అధికారులు, సిబ్బంది



మధురవాడ : యోగా చేస్తున్న యువతులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

అంతర్జాతీయ యోగా దినోత్సవంలో వక్తలు

భీమునిపట్నం, జూన్ 21 : తూర్పు, భీమిలి నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లోనూ యోగా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భీమిలి పట్టణంలో యోగ చైతన్య సంస్థలో తెల్లవారుజామున 5.30 నుంచి యోగా గురువు సత్యనారాయణ ఆధ్వర్యంలో పలువురు ఆసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఆర్‌ఐ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సీఈవో ఎం.రాంబాబు, భీమిలి కోర్టు సీనియర్ అడ్వకేట్ నెయిగాపుల జనార్దనరావు, గాడు వెంకట నారాయణ,యోగ చైతన్య సంస్థ కార్యదర్శి జి. అప్పలనాయుడు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో యూనాని డిస్పెన్సరీ మెడికల్ ఆఫీసరు డాక్టర్ బి.ప్రతిభ ఆధ్వర్యంలో సిబ్బంది ఆసనాలు ప్రదర్శించారు. అలాగే ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఫణి కుమార్ ఆధ్వర్యంలోనూ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కల్యాణ్ శ్రీనివాస్, యోగేష్ పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వున్న భవిత కేంద్రంలో ఐసీఆర్ టీచర్ కెజియా కుమారి ప్రత్యేకావసరాల పిల్లలతో ఆసనాలు వేయించారు.భీమిలి ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో జడ్జి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్ ఏడీఎం జడ్జి సౌజన్య, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులు పార్వతీశం, సుధాకర్, సునీల్, న్యాయవాదులు పాల్గొన్నారు.వారితో యోగ చైతన్య సంస్థ గురువులు ప్రసాద్, గణేష్, శ్రీనివాస్ ఆసనాలు వేయించారు.

ఆనందపురం : ప్రతిరోజూ యోగా చేయడం వల్ల ఆరోగ్యంతో పాటు చదువులో చురుగ్గా ఉండవచ్చని ఆనందపురం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కె. అంజనాకుమారి అన్నారు. యోగా దినోత్సవం సందర్భంగా ఆమె భవితా భవన్‌లో విద్యార్థులకు యోగా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సహిత విద్య ఉపాధ్యాయులు కె.శ్రీనివాసరావు, ఐ. నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ : యోగా వల్ల శారీరక, మానసిక ఎదుగుదల ఉంటుందని ప్రముఖ యోగా గురువు బుడ్డిగ సత్యన్నారాయణ అన్నారు. చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం ఆవరణలో ఈనెల 12 నుంచి 21 వరకు నిర్వహించిన ఉచిత యోగా శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వాహకులు శిక్షకులకు సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో సాయిబాబాల ఆలయం చీఫ్ ట్రస్టీ వానపల్లి అప్పారావు, కార్యదర్శి ఆర్‌ఏ పాత్రో బేగం, మంగరాజు, రవి పాల్గొన్నారు. ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముడసర్లోవ పార్కులోనూ యోగా దినోత్సవం నిర్వహించారు.

కొమ్మాది : యోగా వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుందని ద్రోణాచార్య అవార్డు గ్రహీత, ప్రముఖ బాక్సింగ్ కోచ్ ఐ. వెంకటేశ్వరావు అన్నారు. కొమ్మాది చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె. సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీలోని సత్యసాయి విహార్‌లో విద్యార్థులు యోగ చేశారు. యోగా గురువు సాయిరాం స్వామి విద్యార్థులతో సూర్య నమస్కారాలు, పద్మాసనం, గోముఖాసనం, వజ్రాసనం, శశాంకాసనం వేయించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చేకూరి వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. 18 వార్డు వాసవానిపాలెం ప్రభుత్వ మత్స్యకార ప్రాథమిక పాఠశాలలో యోగా గురువు వాసల్లి శ్రీహరి విద్యార్థులతో యోగా చేయించారు.

సాగర్‌నగర్ : శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలంటే యోగా ఒక్కటే మార్గమని ఎన్‌సీసీ బెటాలియన్ 2 సీటీఆర్ కల్నల్ తపాస్ మండల్ అన్నారు. సాగర్‌నగర్ బీచ్‌లో ఎన్‌సీసీ బెటాలియన్ 2 సీటీఆర్, 13వ ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

భీమునిపట్నం (రూరల్) : తాటితూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనూ యోగా దినోత్సవం నిర్వహించారు. యోగా గురువు ప్రసాదరావు విద్యార్థులతో ఆసనాలు వేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం డి. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు జె. అప్పలనాయుడు మురళీ, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని సింహాచలం దేవస్థానం ఈఓ శ్రీనివాసమూర్తి అన్నారు. ఈఓ కార్యాలయంలో యోగా శిక్షకుడు వెంకటరమణ దేవస్థానం సిబ్బంది, దేవస్థానం హైస్కూల్ వేద పాఠశాల విద్యార్థులతో యోగాసనాలు వేయించారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే సింహాచల నగర్‌లోని ఎంపీపీ పాఠశాలలో హెచ్‌ఎం సన్యాసిరావు సారథ్యంలో జరిగిన కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ పివి నరసింహం, తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస : సంగివలస ఎన్‌ఆర్‌ఐ మెడికల్ కళాశాల విద్యార్థులు పలు యోగాసనాలను ప్రదర్శించారు. కళాశాల డీన్ డా. పీవీ సుధాకర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బందితో పాటు టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు. బంగామెట్ట జీవీఎంసీ పాఠశాలలో కూడా యోగా దినోత్సవం నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం అప్పలరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

వెంకోజీపాలెం : యోగ చేయడం వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం మెరుగవుతుందని ఏయూ వీసీ ప్రసాదరెడ్డి అన్నారు. ఏయూ యోగా విలేజ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.హెచ్‌బీ కాలనీలోని డీసీఐ (డ్రెజింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ప్రధాన కార్యాలయంలోనూ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీఐ చీఫ్ జనరల్ మేనేజర్ కెప్టెన్ దివాకర్, అధికారులు పాల్గొన్నారు. వెంకోజీపాలెంలోని మెడికవర్ ఆసుపత్రిలోనూ యోగా దినోత్సవం నిర్వహించారు.

మధురవాడ : మధురవాడ శిల్పారామంలో పీఎంపీ యోగా ఫ్యామిలీ పదో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురువులు పిళ్లా చిట్టిబాబు, ఉమ, రాణి, సోంపాత్రుడు పలు ఆసనాలు వేశారు. కార్యక్రమంలో దీవీస్ జీఎం రావు, ఎంపీ శ్రీభరత్, జీవీఎంసీ జోన్-2 కమిషనర్ శైలజ వల్లీ, ఏఓ విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని పలు గ్రామాల్లో యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పద్మనాభం, రేవిడి, మద్ది, విజయానందపురం, బీఆర్ తాళ్లవలస, పాండ్రంగి జెడ్పీ పాఠశాలల్లో విద్యార్థులు ఆసనాలు వేశారు.

విశాలాక్షినగర్ : నిత్యం యోగా చేయడం ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఆర్మ్‌డ్ రిజర్వు డీఎస్పీ నాగేశ్వరరావు అన్నారు. కైలాసగిరి పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో అధికారులు, సిబ్బంది యోగాసనాలు వేశారు.

పెదవాల్తేరు : బీచ్ రోడ్డులోని వుడా పార్కు స్కేటింగ్ రింగ్‌లో యోగాసనాలు నిర్వహించారు.యోగ చైతన్య సంస్థ, రోటరీ క్లబ్, రైట్స్ సంస్థల ఆధ్వర్యంలో యోగా గురువు వెంకటరావు పలువురితో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో యోగా చైతన్య సంస్థ కార్యదర్శి నాగిరెడ్డి పాల్గొన్నారు. అలాగే నగర బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఉమ్మిడి సుజాత రాజ్ ఆధ్వర్యంలో యోగాదినోత్సవం ఘనంగా నిర్వహించారు.

అసంపూర్తిగా ఆరిలోవ పోలీస్ స్టేషన్ భవన నిర్మాణం



నిధుల లేమితో అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణం

ఆరిలోవ, జూన్ 21 : పాడుపడిన బంగ్లాలా కనిపిస్తున్న ఈ భవనం స్మార్ట్ సిటీలోని పోలీస్ స్టేషన్. విమ్స్ ఆసుపత్రి ఆవరణలో ఎకరా స్థలాన్ని ఆరిలోవ పోలీస్ స్టేషన్ నిర్మాణానికి అప్పటి టీడీపీ ప్రభుత్వం కేటాయించింది. నాటి హోం శాఖ మంత్రి నిమ్మకాయల చిన రాజప్ప 2019లో ఈ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే నిధుల నుంచి రూ. 50 లక్షలు కేటాయించారు. ఈనిధులతో కొంతమేర పనులు చేశారు. ఇంతలో ప్రభుత్వం మారి వైసీపీ అధికారంలోకి రావ డంతో భవన నిర్మాణం నిలిచిపోయింది. ప్రస్తుతం ఉన్న స్టేషన్‌లో సిబ్బంది కూర్చునేందుకు స్థలం కూడా లేదు. ఎస్‌ఐ కూడా చిన్న గదిలో విధులు నిర్వరించాల్సి వస్తోంది. నూతన భవన నిర్మాణం పూర్తయితే పోలీస్ స్టేషన్ ఆరిలోవ పరిధిలోని పలు ప్రాంతాలకు అందుబాటులో ఉంటుంది. పాలకులు, అధికారులు స్పందించి భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జూపార్కులో నాలుగు ఆర్‌ఓ వాటర్ ప్లాంట్లు నిర్మాణం

ఆరిలోవ, జూన్ 21 : జూపార్కులో సందర్శకుల తాగునీటి సౌకర్యార్థం నాలుగు ఆర్‌ఓ ప్లాంట్ల నిర్మాణానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ నాలుగు వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. వీటితో పాటు మరో నాలుగు నిర్మించనున్నారు. టి. జంక్షన్ వద్ద, జిరాఫీ మోటు, ఏనుగుల మోటు, తెల్ల పులల మోటు వద్ద వీటిని ఏర్పాటు చేయనున్నట్టు జూ క్యూరేటర్ మంగమ్మ తెలిపారు.

జగన్‌ను కలిసిన ముత్తంశెట్టి



భీమునిపట్నం, జూన్ 21 : మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో భీమిలి మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ముత్తంశెట్టితో పాటు ఆయన తనయుడు,విశాఖ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు శివనందీష్ కూడా ఉన్నారు.

ఉద్యానవన పంటలకు 'ఉపాధి' అనుసంధానం పట్ల హర్షం

పద్మనాభం (రూరల్), జూన్ 21 : ఉపాధి హామీ పథకాన్ని ఉద్యానవన పంటలకు అనుసంధానం చేస్తూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని భీమిలి ఏఎంసీ వైస్ ఛైర్మన్ గొర్రెపాటి పెద ఎర్రినాయుడు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల ఎంతోమంది రైతులకు ప్రయోజనం కలుగుతుందన్నారు.

పద్మనాభంలో భారీ వర్షం

పద్మనాభం, జూన్ 21 : పద్మనాభంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం పడింది. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద రోడ్డుపై నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందిపడ్డారు. రెడ్డిపల్లి, మద్ది, కృష్ణాపురం తదితర గ్రామాల్లోనూ వర్షం కురిసింది.

మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన

భీమునిపట్నం/ఆరిలోవ, జూన్ 21 : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని భీమిలి ఎస్‌ఈబీ ఎస్‌ఐ చిన్నంనాయుడు అన్నారు. శుక్రవారం ఆయన మంగమారిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంజాయి, హెరాయిన్, కొకైన్ వంటి డ్రగ్స్ కలిగి వున్నా, వినియోగించినా చట్ట ప్రకారం నేరమని చెప్పారు. ఆరిలోవలోని తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సీఐ గోవిందరావు మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన కల్పించారు.

అప్పన్నకు గరుడ వాహన సేవ



గరుడ వాహనంపై స్వామివారి ఊరేగింపు

సింహాచలం, జూన్ 21 : ఒడిశాకు చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త లక్ష్మీకాంత్ నాయకో దాసుడు తన శిష్య బృందంతో కలిసి వరాహలక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం గరుడసేవ నిర్వహించారు.మధ్యాహ్నం పవళింపు సేవ తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని రజితగరుడ వాహనంపై, ఉభయ దేవేరులను వేరే పల్లకిలో ఉంచి, మాడవీధుల్లో తిరువీధి జరిపారు. మార్గమధ్యంలో కొందరు భక్తులు స్వామికి కర్పూర నీరాజనాలివ్వగా, దేవస్థానం ఈఓ శ్రీనివాసమూర్తి దంపతులు, దాసుడి దంపతులు ఉత్సవంలో పాల్గొని రథాన్ని లాగారు. తిరువీధి ఉత్సవాన్ని పురస్కరించుకుని స్వామివారిని వివిధ రకాల పుష్పమాలికలతో అలంకరించారు.